http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

సోమవారం 25 నవంబర్ 2024

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad




## మహిళా కాంగ్రెస్ ప్రక్షాళనపై

# పార్టీ ఫోకస్

- కొత్త ప్రెసిడెంట్ రేసులో ఉన్నదెవరు..?
- కొత్త అధ్యక్షురాలి నియమకంపై పార్టీ పెద్దలు కసరత్తు
- దీంట్లో సామాజిక సమీకరణాలను కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్టు సమాచారం.



హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఎవరనే చర్చ మొదలైంది. ప్రస్తుతం ఉన్న ప్రెసిడెంట్ తానే కొనసాగేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటే.. కొత్తవాళ్లు తమ ప్రయత్నాలను కూడా స్పీడప్ చేశారు. నాకు ఏదో ఒక పదవి ఇచ్చాకే, కొత్త వాళ్ళను పెట్టాలంటూ పేచీ పెడుతోందట ప్రస్తుత ప్రెసిడెంట్. ప్రస్తుతం మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ సునీతరావు పదవీకాలం ముగిసి ఐదు నెలలు అయింది. కొత్త ప్రెసిడెంట్ నియమకానికి పార్టీ కూడా కసరత్తు చేస్తుంది. - మిగతా3లో



## ఢిల్లీకి వెళ్లనున్న సీఎం రేవంత్ రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ బాట పట్టారు. సోమవారం దేశ రాజధానికి వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానంతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలపై చర్చించే అవకాశం ఉంది. ఈ ఉత్సవాలకు హాజరుకావాలని ఏఐసీసీ పెద్దలను రేవంత్ రెడ్డి కోరనున్నట్లు సమాచారం. సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు సభకు హాజరుకావాలని రాహుల్ గాంధీని కోరనున్నట్లు తెలుస్తోంది. అలాగే కార్పొరేషన్ పదవులు, మంత్రివర్గ విస్తరణపై కూడా కాంగ్రెస్ పెద్దలతో రేవంత్ రెడ్డి చర్చించనున్నట్లు సమాచారం. మహారాష్ట్ర ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి పాలన ఏ మాత్రం ఇంపాక్ట్ చేయలేకపోయింది. ముఖ్యంగా ఆయన ప్రచారం చేసిన స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించలేకపోయింది. దీంతో మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటమికి రేవంత్ రెడ్డినే కారణమని అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ఆసక్తికరంగా మారింది.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం




- స్థానిక–పోరులో సత్తా చాటుదాం
- నాయకులు పార్టీ మారినా.. పార్టీతోనే కార్యకర్తలు
- పార్టీ మారిన వ్యక్తులను ప్రజలు క్షమించరు
- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్

భారత దేశ చరిత్రలోనే అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం ఎక్కడా లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన వ్యక్తులను ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తన నివాసంలో - మిగతా3లో

## రెండు రోజులే గడువు..

- లేదంటే మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన
- సీఎం కుర్చీ ఎవరనేదానిపై కూటమి పార్టీల మధ్య చర్చలు
- మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన అంటూ మరో వార్త హల్‌చల్
- స్పష్టమైన మెజార్టీ మహాయుతి కూటమికి వచ్చిన తర్వాత కూడా రాష్ట్రపతి పాలన విధించడం ఏమిటనే చర్చ



## ఈవీ'లపై రాయితీలు ప్రజలకు తెలియాలి

- వాహన షోరూమ్‌ల వద్ద బోర్డులు పెట్టించండి: పొన్నం
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



### ప్రభుత్వ ప్రోత్సాహం కల్పిస్తాం..

## మహిళలు ముందుకు రావాలి

- పురుగు మందులు లేని కూరగాయల సాగును మిద్దె తోటల్లో చేయాలని
- కల్తీ ఆహారం పురుగు మందుల అవశేషాలున్న కూరగాయలు తిని మనిషి కష్టార్జితం అంతా హాస్పిటల్ పాలవుతుంది
- నేను రాజకీయాల్లోకి రావడానికి కారణమదే..
- కమ్మ జాతి అన్నికులాలను అక్కున చేర్చుకొని ఆదర్శంగా ఉంటారు
- పోయేటపుడు బంగారం వజ్రాలు నగలు మనతో రావు
- వ్యవసాయం ప్రధానంగా ఉన్న కమ్మ జాతి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారు
- ప్రపంచీకరణ నేపథ్యంలో కమ్మ వారు అమెరికాలో రాణిస్తున్నారు

ఖమ్మం

మిద్దె తోటలకు తమ ప్రభుత్వ ప్రోత్సాహం ఇస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెనింగ్ ఫౌండర్ హర్కర శ్రీనివాస్ సరోజ ఆధ్వర్యంలో ఇవాళ (ఆదివారం) సదస్సు జరిగింది. ఈ సదస్సులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడు తూ... పురుగు మందులు లేని కూరగాయల సాగును మిద్దె తోటల్లో చేయాలని సూచించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా మిద్దె తోటల్లో కూరగాయల సాగుతో ఆ కుటుంబాలు - మిగతా3లో





## సోషల్ మీడియాతో న్యాయమూర్తులను ప్రభావితం చేస్తున్నారు..!

- మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు..!
- భారత న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న చాలా తీవ్రమైన సమస్య
- కేసుల తీర్పులను ప్రభావితం చేసేందుకు కొందరు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు.
- కోర్టుల నిర్ణయాలపై తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించేరందుకు ప్రతి పౌరుడికి హక్కు ఉంది
- ప్రజాస్వామ్యంలో చట్టాల చెల్లుబాటును నిర్ణయించే అధికారం రాజ్యాంగ న్యాయస్థానాలకు అప్పగించాం

# సర్వేలో వారి పూర్తి వివరాలు సేకరించాలి

- ఎన్యూమరేటర్లకు డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు
- వారికి సర్వే గురించి ఫోన్‌లో సమాచారం అందించాలని ఆదేశం
- సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుంది
- డేటా ఎంట్రీ దశ చాలా ముఖ్యమైనది
- ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలి



హైదరాబాద్

సమగ్ర కుటుంబ సర్వేలో డోర్ లాక్ ఉన్న వారికి, వలసలు వెళ్లిన వారి వివరాలను కూడా సేకరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఝార?ండ్ రాజధాని రాంచీ నుంచి ఉన్నతాధికారులు, కలెక్టర్లతో సమగ్ర కుటుంబ సర్వేపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృశ్య మాధ్యమ సమీక్ష నిర్వహించారు. సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, డేటా ఎంట్రీ దశ చాలా ముఖ్యమైనది ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సర్వేపై ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లుకు పలు సూచనలు చేశారు. డేటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమైందని, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సొంతూళ్లలోనే కుటుంబ వివరాలు - మిగతా3లో

### అదానీ లంచాల వ్యవహారంపై

## పార్లమెంట్‌లో చర్చించాలి

- అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ డిమాండ్
- వక్ఫ్ సవరణ బిల్లు, మణిపూర్ హింసాకాండపై చర్చకు డిమాండ్ చేసే అవకాశం
- శీతాకాల సమావేశాలు సోమవారం నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి.



# రెండు రోజులే గడువు..

మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మహాయుతి కూటమి అధికారానికి అవసరమైన మెజార్టీ సాధించింది. సీఎం కుర్చీ ఎవరనేదానిపై కూటమి పార్టీల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన అంటూ మరో వార్త హల్‌చల్ చేస్తోంది. స్పష్టమైన మెజార్టీ మహాయుతి కూటమికి వచ్చిన తర్వాత కూడా రాష్ట్రపతి పాలన విధించడం ఏమిటనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి మహారాష్ట్ర శాసనసభ పదవీకాలం నవంబర్ 26తో ముగుస్తుంది. శాసనసభ పదవీ కాలం ముగిసేలోపు కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. అంటే నవంబర్ 26లోపు మహాయుతి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఏర్పాటులో ఏదైనా ఆలస్యం జరిగి నవంబర్ 26లోపు సీఎం ప్రమాణ స్వీకారం జరగకపోతే అక్కడ రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంటుంది. కొత్త ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడితే అప్పటివరకు ప్రెసిడెంట్ రూల్ కొనసాగుతుంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మాత్రం మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలనకు అవకాశాలు లేవనే చెప్పుకోవాలి. నవంబర్ 25 లేదా 26వ తేదీన మహాయుతి కూటమి నుంచి ఒకరు సీఎంగా ప్రమాణం చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మరోసారి సీఎంగా ప్రమాణం చేసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. భవిష్యత్తు రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ అధిష్టానం షిండే సీఎం అభ్యర్థిత్వానికి ఓకే చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఎం ఎవరనేదానిపై బీజేపీ, షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ మధ్య చర్చలు జరుగుతున్నాయి.



గతంలో వలె ఒక సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంలు సోమ, మంగళవారాల్లో ప్రమాణం చేయనున్నారు. అజిత్ పవార్ డిప్యూటీ సీఎంగా ఉండేందుకు అంగీకరించినప్పటికీ కీలక శాఖలు తనకు ఇవ్వాలని అడిగినట్లు తెలుస్తోంది. సీఎం పదవి శివసేనకు ఇస్తే హోంశాఖను బీజేపీ తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోసారి ఆర్థిక శాఖ మంత్రిగా పవార్ ఉండే అవకాశాలు లేకపోలేదు. హోంశాఖను అజిత్ పవార్ అడుగుతున్నప్పటికీ బీజేపీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాల్సి ఉంది.

**సీఎం ఎవరు..**

మహారాష్ట్ర సీఎం ఎవరనే ఉత్కంఠ ఇంకా వీడలేదు. ఓవైపు ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రి పదవిని కోరుకుంటుండగా.. అజిత్ పవార్ సైతం ఆసక్తి చూపిస్తున్నారు. బీజేపీ శ్రేణులు మాత్రం ఫడ్నవీస్‌ను సీఎం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఫడ్నవీస్ సీఎం అంటూ పోస్టర్లు వెలిశాయి. బీజేపీ అధిష్టానం మాత్రం ఎవరిని సీఎం చేయాలనే అంశం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈరోజు సాయంత్రానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరనేదానిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# అభయాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక





**అగ్ని ధార న్యూస్. మందమర్రి. నవంబర్ 24.** 24-11-24 రోజున, మందమర్రి పట్టణంలో 23వ వార్డు,మారుతీ నగర్ లోని,అభయ ఆంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్ బండి సదానందం యాదవ్. తలపెట్టిన పనిలో విజయాన్ని అందుకునేలా ధైర్యాన్ని నింపి ముందుకు నడిపిస్తున్న ఆంజనేయ స్వామి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండి, జీవితాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు,ఆలయ కమిటీ చైర్మన్ బండి సదానందం యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మందమర్రి మారుతీ నగర్ అభయాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీని ఎన్నుకోగా.. చైర్మన్ హోదాలో ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ,నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యుల శాతం, గుడి అభివృద్ధికి ఐక్యతతో కృషి చేయాలని తెలుపుతూ.. వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మూల రవీందర్ రెడ్డి, బండారి సత్యనారాయణ, నాగుల దుర్గయ్య, ఉపాధ్యక్షులు రాగిడి రామ్ రెడ్డి, కుంట తిరుపతి ప్రధాన కార్యదర్శిగా మంచి కట్ల రమేష్, జాయింట్ సెక్రెటరీ సిరిపురం లక్ష్మణ్, కోశాధికారి పెద్ది రాజన్న, లీగల్ అడ్వైజర్ మేకల రాజన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకల శంకర్, కార్యవర్గ సభ్యులు నగేష్,రాజశేఖర్, సదానందం,రాజయ్య, వీరేశం,కనకయ్య,రమేష్, శ్రీను తో పాటు,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అత్యధిక, అత్యల్ప మెజార్టీలు ఇవే.. మహా ఓటరు తీర్పులో ఎన్నో ట్విస్టులు..



మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మహాయుతి, మహా వికాస్ అఘాడి మధ్య జరిగిన పోరులో బీజేపీ, షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కలిసిన మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. మహాయుతి సృష్టించిన సునామీకి కాంగ్రెస్, ఎన్సీపీ(శరద్ పవార్), శివసేన(యూబీటీ)లు కలిసిన మహా వికాస్ అఘాడి పత్తా లేకుండా పోయింది. మహారాష్ట్ర ఓటరు స్పష్టమైన తీర్పు ఇవ్వడంతో మహాయుతి కూటమి అభ్యర్థులు గెలిచిన స్థానాల్లో ఎక్కువ నియోజకవర్గాల్లో భారీ మెజార్టీ సాధించారు. మహా వికాస్ అఘాడి గెలిచిన స్థానాల్లో శివసేన(యూబీటీ) అభ్యర్థుల్లో ఒకరే 50వేలకు పైగా మెజార్టీతో గెలుపొందారు. మిగతా అభ్యర్థులు 50 వేల లోపు మెజార్టీ సాధించారు. మహాయుతి కూటమిలో మాత్రం దాదాపు 15 మంది లక్షలకు పైగా మెజార్టీ సాధించారు. బీజేపీ అభ్యర్థులు ఎనిమిది చోట్ల, షిండే నేతృత్వంలోని శివసేన మూడు చోట్ల, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ నాలుగు చోట్ల లక్షకు పైగా మెజార్టీ సాధించింది. మొత్తం మహాయుతి కూటమి 235 స్థానాల్లో మహా వికాస్ అఘాడి 49, ఎంఐఎం ఒకటి, పీడబ్ల్యూపీఐ ఒక స్థానంలో గెలుపొందగా ఇతరులు రెండు స్థానాల్లో గెలిచారు. అత్యధిక మెజార్టీ సాధించిన వారిలో ఎక్కువమంది బీజేపీ, షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి చెందిన అభ్యర్థులే ఉన్నారు.

**అత్యధికం.. అత్యల్ప స్థానాలు ఇవే..**

మహారాష్ట్రలోని సిర్పూర్ శాసనసభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కాశీరామ్ వెచన్ పవార్ తన సమీప ప్రత్యర్థి స్వతంత అభ్యర్థి డాక్టర్ జితేంద్ర యువరాజ్ ఠాకూర్‌పై లక్షా 45వేల 944 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మహారాష్ట్ర మొత్తంగా చూస్తే ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా కాశీరామ్ వెచన్ పవార్ రికార్డు సృష్టించారు. ఇక ఎంఐఎం అభర్థి ముఫ్తీ మహ్మద్ ఇస్మాయిల్ అబ్దుల్ మాలేగావ్ సెంట్రల్ నుంచి కేవలం 162 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి 38,519 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందిన ఎంఐఎం అభ్యర్థి ముఫ్ మహ్మద్ ఇస్మాయిల్ ఈ ఎన్నికల్లో కేవలం 162 ఓట్ల తేడాతో గెలిచారు. మహారాష్ట్రలో అతి తక్కువ మెజార్టీతో గెలిచిన అభ్యర్థిగా ఇస్మాయిల్ నిలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌కు చెందిన నానాబహు ఫల్గుణరావ్ పటేల్ సకోలి నియోజకవర్గం నుంచి 208 ఓట్ల తేడాతో గెలిచారు.

**మహా ఓటరు తీర్పులో ట్విస్ట్‌లు..**

మహారాష్ట్ర ఓటర్లు ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా ఈ ఎన్నికల్లో స్పష్టమైన తీర్పునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడి ఎక్కువ స్థానాలు సాధించడంతో మహారాష్ట్రలో ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని, పార్టీని చీల్చారనే ఉద్దేశంతో షిండే, అజిత్ పవార్‌పై ప్రజలు కోపంగా ఉన్నారంటూ మహా వికాస్ అఘాడి చేసిన ప్రచారం అసత్యమని ఫలితాల ద్వారా తెలుస్తోంది. మహాయుతి కూటమి అధికారంలో ఉండాలని ప్రజలు స్పష్టమైన తీర్పునివ్వగా.. ఈ ఎన్నికల్లో మాత్రం హిందూ ఓట్లు పోలరైజ్ అయ్యాయనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం సీట్లలో 80 శాతానికి పైగా సీట్లను మహాయుతి కూటమి గెలుచుకోవడంతో ఓట్ల పోలరైజేషన్ జరిగిందనే చర్చ జరుగుతోంది.

## తప్పుగా చూపించిన జీపీఎస్.. నిర్మాణంలో ఉన్న వంతెన పైనుంచి పడిన కారు, ముగ్గురు మృతి



**లక్నో:** జీపీఎస్ నావిగేషన్ మ్యాప్ తప్పుగా చూపించడంతో నిర్మాణంలో ఉన్న వంతెన పైనుంచి కారు కింద పడింది. అందులో ప్రయాణించిన ముగ్గురు వ్యక్తులు ఈ ప్రమాదంలో మరణించారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొందరు వ్యక్తులు బరేలీ నుంచి బదౌన్ జిల్లాలోని డేటాగంజ్‌కు కారులో వెళ్తున్నారు. ఆదివారం ఉదయం పది గంటల సమయంలో ఖల్పూర్-దతాగంజ్ రహదారిపై ఆ కారు వేగంగా ప్రయాణించింది. కాగా, నావిగేషన్ పొరపాటు వల్ల నిర్మాణంలో ఉన్న వంతెనపైకి ఆ కారు దూసుకెళ్లింది. దీంతో వంతెన పైనుంచి కింద ఉన్న రామగంగా నదిలో అది పడింది. ఆ కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను కారు నుంచి బయటకు తీశారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు, కొన్ని నెలల కిందట భారీ వరదల కారణంగా నిర్మాణంలో ఉన్న వంతెన ముందు భాగం నదిలో కూలిపోయిందని పోలీసులు తెలిపారు. దీని గురించి జీపీఎస్‌లో మార్పు చేయకపోవడంతో నావిగేషన్ మ్యాప్‌లో తప్పుగా చూపించిందని చెప్పారు. అలాగే ఆ వంతెన ప్రవేశం వద్ద ఎలాంటి సూచనలు, హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఆ కారు తప్పుదారి పట్టిందని, వంతెన పైనుంచి కింద ఉన్న నదిలో పడిందని వెల్లడించారు.

## మసీదు సర్వే నేపథ్యంలో హింస.. ముగ్గురు మృతి, 30 మందికిపైగా గాయాలు



**లక్నో:** మసీదు సర్వేను స్థానికులు అడ్డుకున్నారు. పోలీసులతో ఘర్షణ సందర్భంగా రాళ్లు రువ్వారు. పలు వాహనాలకు నిప్పుపెట్టారు. దీంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. ఈ హింసలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. పోలీసులతో సహా 30 మందికిపైగా గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మొఘల్ కాలం నాటి జామా మసీదుపై ఒక వ్యక్తి స్థానిక కోర్టును ఆశ్రయించాడు. హిందూ ఆలయాన్ని కూల్చి అక్కడ మసీదు నిర్మించినట్లు ఆరోపించాడు. దీంతో సర్వే చేయాలని కోర్టు ఆదేశించింది. మంగళవారం తొలిసారి సర్వే జరుపడడంతో ఉద్రికత్తలకు దారితీసింది. కాగా, ఆదివారం ఉదయం 7 గంటలకు అడ్వకేట్ కమిషనర్ నేతృత్వంలోని సర్వే బృందం ఆ మసీదు వద్దకు చేరుకున్నది. పోలీసులు కూడా భారీగా మోహరించారు. అయితే సుమారు వెయ్యి మందికిపైగా స్థానికులు సర్వే బృందాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులతో ఘర్షణ జరిగింది. స్థానికులు రాళ్లు రువ్వడంతోపాటు పలు వాహనాలను తగులబెట్టారు. మరోవైపు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించడంతోపాటు లాఠీ ఛార్జ్ చేశారు. ఈ హింసలో నయీమ్, బిలాల్, నౌమాన్ అనే ముగ్గురు వ్యక్తులు మరణించారు. సుమారు 20 మందికిపైగా పోలీసులతో సహా 30 మందికిపైగా గాయపడ్డారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొనడంతో భారీగా పోలీసులను మోహరించారు.

## అదానీ లంచాల వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించాలి



పార్లమెంట్ శీతాకాల సమావేశం సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ఆదివారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. అయితే, అదానీ గ్రూప్‌పై లంచం ఆరోపణలపై చర్చించాలని అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ డిమాడ్ చేసింది. శీతాకాల సమావేశాల్లో విపక్షాలు ఈ అంశంపై చర్చకు పట్టుపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో సమావేశాలు స్తంభించే అవకాశం ఉండగా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీకి కొత్త ఊరటనిచ్చాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, శివసేన, బీజేడీ తదితర పార్టీల నేతలు సమావేశానికి హాజరయ్యారు. శీతాకాల సమావేశాలు సోమవారం నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. వక్ఫ్ సవరణ బిల్లు, మణిపూర్ హింసాకాండపై చర్చకు డిమాండ్ చేసే అవకాశం ఉన్నది. ఇప్పటికే పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికా ఆరోపణలపై ప్రతిపక్షాలు కేంద్రంపై విరుచుకుపడుతున్నాయి. గౌతమ్ అదానీ కేసుపై పార్లమెంట్ సంయుక్త కమిటీతో విచారణ జరిపించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. సమావేశానంతరం కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ మాట్లాడుతూ అదానీ లంచాల కుంభకోణంపై సమావేశంలో చర్చకు అనుమతించాలని తమ పార్టీ ప్రభుత్వాన్ని కోరిందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చించేందుకు ఏర్పాటైన జేపీసీ శీతాకాల సమావేశాల మొదటి వారం చివరిలో తన నివేదికను సమర్పించే అవకాశం ఉన్నది. జేపీసీలో చేరిన విపక్ష ఎంపీలు నివేదిక సమర్పించేందుకు మరింత సమయం కావాలని డిమాండ్ చేస్తున్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 26న సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమంపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పంజాబ్ కోర్టుల సవరణ బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ఇండియన్ పోర్ట్స్ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది. సమావేశం అనంతరం కేంద్రమంత్రి కిరణ్ రిజుజు మాట్లాడుతూ సమావేశానికి 30 రాజకీయ పార్టీలకు చెందిన 42 మంది నేతలు హాజరయ్యారన్నారు. కొన్ని అంశాలపై నేతలు చర్చించాలన్నారు. కానీ, లోక్‌సభ, రాజ్యసభలో మంచి చర్చ జరగాలని కోరుకుంటున్నామన్నారు. ఏ అంశంపైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# ప్రభుత్వ ప్రోత్సాహం కల్పిస్తాం..
# మహిళలు ముందుకు రావాలి

-మొదటిపేజీ తరువాయి

ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కల్తీ ఆహారం పురుగు మందుల అవశేషాలున్న కూరగాయలు తిని మనిషి కష్టార్జితం అంతా హాస్పిటల్ పాలవుతుందని చెప్పారు. టెర్రస్ గార్డెనింగ్ సామాజిక ఉద్యమంగా సాగాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కాగా.. మార్కెట్‌లో పండ్లు, కూరగాయలు కొనాలన్నా భయం.. రసాయనాలతో పండించిన పంట ఆరోగ్యానికి చేటు చేస్తుందని టెన్షన్. అందుకే ఇంట్లోనే ఎంచక్కగా నచ్చిన వాటిని కొందరు పండిస్తున్నారు. హైదరాబాద్, తెలంగాణలోని పలు జిల్లాలో ఈ ట్రెండ్ ఎక్కువగా కనిపిస్తోంది. ఉద్యానశాఖ అధికారులు కూడా అర్బన్ ఫార్మింగ్‌పై దృష్టి పెట్టారు. మిద్దెలమీద సాగుకు జనం జై కొట్టేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ప్రజలకు హార్టీ కల్చర్ డిపార్ట్ మెంట్ అవగాహన కల్పిస్తోంది. నాంపల్లిలో ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను కూడా ప్రారంభించింది. గత కొన్నేళ్లుగా టెర్రస్ గార్డెనింగ్‌పై ఔత్సాహికులకు శిక్షణ ఇస్తోంది. ప్రతి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తోంది. ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వాట్సాప్ గ్రూప్‌ను కూడా ఏర్పాటు చేసింది.



నేను రాజకీయాల్లోకి రావడానికి కారణమదే..

పూజ్యులు నందమూరి తారక రామారావు దీవెనలతో తాను రాజకీయాల్లో ఉన్నానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తుచేశారు. సెంటి మీటర్ లేని జిల్లాలో జాతీయ రహదారులుతో ప్రగతి బాటలు పట్టించానని పేర్కొన్నారు. కాకతీయులు కాలం నుంచి కుమ్మ వారి చరిత్ర సజీవ సాక్ష్యమని వ్యాఖ్యానించారు. ఖమ్మంలో కార్తీక ఇవాళ(ఆదివారం) వన సమారాధనల సందడి నెలకొంది. చెరుకూరి వారి తోటలో యాదవ బ్రాహ్మణ వైశ్య వన సమారాధన, వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో కమ్మ వారి వన సమారాధన జరిగాయి. ఈ రెండు వన సమారాధనల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా కమ్మ వారికి తెలుగు వారికి గుర్తింపు తెచ్చిన పూజ్యులు నందమూరి తారక రామారావు అని ప్రశంసించారు.

కమ్మ జాతి అన్నికులాలను అక్కున చేర్చుకొని ఆదర్శంగా ఉంటారని తెలిపారు. పోయేటపుడు బంగారం వజ్రాలు నగలు మనతో రావు అని చెప్పారు. దాన గుణం కమ్మ వారికి ఆభరణమని అన్నారు. కాకతీయులు ముసునూరు కమ్మ రాజుల స్ఫూర్తి ముందు తరాలకు ఆదర్శమని చెప్పారు. వ్యవసాయం ప్రధానంగా ఉన్న కమ్మ జాతి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని అన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో కమ్మ వారు అమెరికాలో రాణిస్తున్నారని తెలిపారు. తోటి కులాలను గౌరవిస్తూ లౌకిక భావనతో కమ్మ కులం ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ భక్తరామ దాసు ప్రాజెక్టలతో సస్య శ్యామలం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు.

# మహాధర్నాకు పోలీసులు సహకరించాలి..
## మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రిక్వెస్ట్

నీతులు చెప్పే పాలకులు నీతిమాలిన విధంగా మహబూబాబాద్‌లో మహాధర్నాకు అనుమతిని ఇవ్వలేదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. తమ ఉద్దేశం సరైనదే అని గుర్తించి హైకోర్టు అనుమతినిచ్చిందని తెలిపారు. గిరిజన, దళిత, పేద రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండకు నిరసనగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన మహా ధర్నా స్థలాన్ని మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, రెడ్యా నాయక్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. . హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని అన్నారు. బీఆర్ఎస్ తలపెట్టిన ఈ మహాధర్నాకు పోలీసులు, అధికార యంత్రాంగం సహకరించాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. బీఆర్ఎస్ హయాంలో పార్టీలకు అతీతంగా అనుమతులు ఇచ్చి ప్రజాస్వామ్యాన్ని



గౌరవించామని పేర్కొన్నారు. లగచర్ల ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రేపటి మహబూబాబాద్ మహా ధర్నాను అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ యత్నిస్తుందని ఆరోపించారు. మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుంటుందని మండిపడ్డారు. సోషల్ మీడియాలో వాస్తవాలను వెల్లడిస్తే తమపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్బండ వర్గాలను అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. రేపటి మహబూబాబాద్ మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రెడ్యా నాయక్ మాట్లాడుతూ.. లగచర్లలో గిరిజనుల మీద దాడులపై నిరసనలు తెలుపుతామని తెలిపారు. రేపటి మహా ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని అన్నారు. ఈ ధర్నాకు వ్యతిరేకంగా దాడులు చేస్తామని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు.సంఘ విద్రోహ శక్తుల పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా గిరిజనులు స్వచ్ఛందంగా ఈ మహాధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం..

-మొదటిపేజీ తరువాయి

జగిత్యాల నియోజకవర్గ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు కులగణన కమిషన్‌కు నివేదిక అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో, బీసీ సంఘాల నాయకులతోనూ ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు.

**జగిత్యాలతో ఆత్మీయ అనుబంధం**

జగిత్యాలకు, నాకు ఆత్మయ అనుబంధం ఉందని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. 2014 లో నిజామాబాద్ ఎంపీగా తాను గెలిచినా, జగిత్యాల ఎమ్మెల్యేగా సంజయ్ కుమార్ ఓడిపోయారని, కానీ పార్టీలకతీతంగా, వచ్చిన తెలంగాణను అభివృద్ధి చేసుకువాలని, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా, అభివృద్ధిలో జగిత్యాల వెనకబడొద్దనే ఆదేశాలను కేసీఆర్ ఇచ్చారని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడగానే చిన్న జిల్లాలు ఏర్పాటు చేసుకోవాలి. చిన్న జిల్లాల ద్వారానే ఎక్కువ అభివృద్ధి జరుగుతుంది, గ్రామాల్లో ఉన్న ప్రతి పేద వ్యక్తికి కూడా తెలంగాణ సాధించిన ఫలితం అందుతుందని కేసీఆర్ తెలంగాణ ఉద్యమం రోజుల్లోనే చెప్పేవారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కేసీఆర్, జగిత్యాల జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు, హైదరాబాద్ తరువాత ఎక్కువ సంఖ్యలో, 4,500 డబుల్ బెడ్ రూం ఇండ్లు జగిత్యాలకే కేటాయించి ప్రత్యేక శ్రద్ధ చూపెట్టారు%-% అని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

**నాయకులు పార్టీ మారినా.. పార్టీతోనే కార్యకర్తలు**

ప్రస్తుతం పార్టీ మారిన ఎమ్మెల్యే సంజయ్, అప్పుడు ఎమ్మెల్యే కాకపోయినా, పార్టీ ప్రతి కార్యక్రమంలో వేదిక పైకి తీసుకొచ్చి, కాబోయే ఎమ్మెల్యే అంటూ ఐదేండ్ల పాటు ప్రతి గ్రామంలో చెప్పామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఓడిపోయినా వదిలేయకుండా గౌరవంగా చూసుకుంటామనే సందేశం ఇచ్చిన సభ్యత గల పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆనాడు జగిత్యాల ఎమ్మెల్యేగా ఉన్న జీవన్ రెడ్డి ఎన్ని ఆకృత్యాలు, ఆఘాయిత్యాలు చేసినా, బీఆర్ఎస్ కార్యకర్తలంతా ముందుండి కొట్లాడారు కాబట్టే, జగిత్యాలలో గులాబీ జెండా ఎగిరిందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. నాయకులు పార్టీలు మారినా, కార్యకర్తలు పార్టీలోనే ఉంటారని చెప్పడానికి మంచి ఉదాహరణ జగిత్యాల నియోజకవర్గం అని ఆమె పేర్కొన్నారు.

పార్టీ మారిన వ్యక్తులను ప్రజలు క్షమించరు

ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీకి మారిపోయినప్పుడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్తే అర్థముండేదని, కానీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా గోడ మీద పిల్లిలాగ ఉండటం తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడం లాంటిదని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. అలాంటి వ్యక్తులను ప్రజలు క్షమించరని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేసారు. ఎమ్మెల్యే పదవిని అడ్డు పెట్టుకోవడం పిరికితనమని, అలాంటి నాయకులు బీఆర్ఎస్ కు అవసరం లేదని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేసారు. గులాబీ జెండా అంటేనే గుండె ధైర్యం, గులాబీ జెండా అంటేనే ఉద్యమ పిడికిలి అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పిరికివాళ్లు, పదవుల వ్యామోహం ఉన్న వాళ్లు బీఆర్ఎస్ పార్టీకి అవసరం లేదన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని, పార్టీ నుండి కార్యకర్తలకు, స్థానిక నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ కవిత భరోసానిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఎమ్మెల్యే పార్టీ మారారనే అంశంతో సంబంధం లేకుండా గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోతోందని, వాళ్లు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకా ప్రారంభించలేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, వైఫల్యాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు ఎమ్మెల్సీ కవిత.

**సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం**

ప్రతి గ్రామంలో వాట్సాప్ గ్రూప్ లు, సోషల్ మీడియా సిద్ధం చేసుకోవాలని, కేసీఆర్ హయంలో ఎలా ఉంది, ప్రస్తుతం ఎలా ఉంది అనే అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు. కరెంటు కోతలు, రైతు భరోసా, మహిళలకు నెలకు రూ. 2,500 ఇవ్వకుండా ఎలా మోసం చేసారనే అంశాలను ఇప్పటినుండే చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలను తీసుకొని, స్థానిక సంస్థల ఎన్నికల్లో జగిత్యాలలో మెజారిటీ సీట్లు గెలిచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్సీ కవిత పార్టీ నేతలకు సూచించారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్ రావు మాట్లాడుతూ.. %-%నీ కోసం తపించిన బిడ్డ కష్టాల్లో ఉండి, జైల్లో ఉన్నప్పుడు పార్టీ మారిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్,రాజకీయాలకు మచ్చ తెచ్చారు%-% అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ తదితరులు పాల్గొన్నారు

**బీసీ నాయకులతో ఎమ్మెల్సీ కవిత సమావేశం**

బీసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులతో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. యునైటెడ్ ఫులే ఫ్రంట్, తెలంగాణ జాగృతి, బీసీ కుల సంఘాల ప్రతినిధులతో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. రేపు ఉదయం 11 గంటలకు కులగణన కమిషన్‌కు ఎమ్మెల్సీ కవిత నివేదిక అందజేస్తారు. ఈ సమావేశంలో జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బీసీ నేతలు గట్టు రాంచందర్ రావు, బొల్లా శివ శంకర్ , ఆలకుంట హరి, ఉపేందర్, మఠం భిక్షపతి, రాజారాం యాదవ్, దావ సురేష్ పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ ప్రక్షాళనపై పార్టీ ఫోకస్

-మొదటిపేజీ తరువాయి

కొత్త చీఫ్ నియమించటానికి పార్టీ చేసిన కసరత్తు స్పీడ్ అప్ అయింది. అయితే దీనికి బ్రేకులు వేసే పనిలో ప్రస్తుత అధ్యక్షురాలు సునీతరావు ఉన్నారట. దేశంలోనే ఎక్కువ సభ్యత్వం చేశా పార్టీ కోసం ఎన్నో ఉద్యమాలు చేశా.. 80 కి పైగా తనపై కేసులు ఉన్నాయంటూ జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వద్ద మొరపెట్టుకున్నారట సునీతరావు. కొత్త అధ్యక్షురాలు నియామకం చేపడితే మహిళా కాంగ్రెస్ కోసం తాను చేసిన కృషిని పరిగణలోకి తీసుకుని నామినేటెడ్ పోస్ట్ ఇవ్వాలని ఒత్తిడి పెంచుతుందట. ఇటు పార్టీ అటు ప్రభుత్వంలో ఉన్న పెద్దల ముందు డిమాండ్ పెట్టారట.

అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం నుంచి సునీతారావు పోటీ చేసి ఓడిపోయారు. అప్పట్లో అనుబంధ సంఘం అధ్యక్షులు ఎవరికి కూడా టికెట్లు ఇవ్వలేదు. కేవలం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావుకి టికెట్ ఇచ్చింది పార్టీ. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనుబంధ సంఘాల చైర్మన్ లందరికీ కార్పొరేషన్ చైర్మన్ పదవులను కట్టబెట్టింది. అయితే సునీత రావు పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో అనుబంధ సంఘాల చైర్మన్లను కార్పొరేషన్ పదవులు ఇచ్చిన నేపథ్యంలో తనకు కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారట. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఇచ్చిన వారికి ఇప్పుడు వెంటనే కార్పొరేషన్ పదవులు ఇచ్చే అవకాశం లేదని పార్టీ అధిష్టానం స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సునీతరావు కొంత నారాజులో ఉన్నారట. కొత్త అధ్యక్షురాలి నియమకంపై పార్టీ పెద్దలు కసరత్తు మొదలుపెట్టారు. దీంట్లో సామాజిక సమీకరణాలను కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్టు సమాచారం. ప్రస్తుతం అధ్యక్షురాలుగా ఉన్న సునీతారావును మార్చాల్సి వస్తే, బీసీ సామాజిక వర్గానికి చెందిన మరో మహిళని అధ్యక్షురాలు చేయాలనేది పార్టీ ఆలోచనగా కనబడుతుంది. ఏఐసిసి కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళనే అధ్యక్షురాలుగా పెట్టాలని నిర్ణయం తీసుకుందట. హై కమాండ్ మరో సామాజిక వర్గానికి చెందిన మహిళా నాయకురాలు పేరు కూడా పరిశీలిస్తోందట. అవసరం వస్తే.. ఓసీకి పదవి ఇవ్వాల్సి వస్తే.. అనే కోణంలో పార్టీ పెద్దలు అలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ బీసీ.. మరో ఓసీ నాయకురాలి పేర్లను పరిశీలిస్తోందట పార్టీ. బీసీ సామాజిక వర్గానికి చెందిన గద్వాల మాజీ జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య తోపాటు, ఓసి సామాజిక వర్గానికి సంబంధించి బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నరసింహారెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే సరితా తిరుపతయ్యకు సీఎం రేవంత్ మద్దతు కూడా ఉన్నట్లు పార్టీ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన సరిత తిరుపతతయ్యకే దాదాపుగా మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఖాయమైనట్టు ప్రచారం జరుగుతుంది. ఇదంతా ఒక ఎత్తు అయితే సునీతరావుకు ఏదో ఒక పదవి కన్ఫర్మ్ అయ్యాకనే కొత్త మహిళా అధ్యక్షురాలి పదవి ఇవ్వాలనే ఒత్తిడి పెంచుతున్నారట. అయితే పార్టీ మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇచ్చిన వారికి తిరిగి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకుంది. కాబట్టి ప్రస్తుత అధ్యక్షురాలు సునీతరావు ఏఐసిసి వరకు తనకేదో పదవి ఇచ్చేంతవరకు కొత్త చీఫ్ ని పెట్టొద్దంటూ ఒత్తిడి పెంచుతున్నారట.

## ఈవీ'లపై రాయితీలు ప్రజలకు తెలియాలి



హైదరాబాద్ : కాలుష్యాన్ని తగ్గించడంలో భాగంగా ఈవీ(ఎలక్ట్రిక్ వాహనాలు)ల రిజిస్ట్రేషన్‌లో ప్రభుత్వం రాయితీలు ఇస్తున్న విషయం ప్రజలకు చేరువవ్వాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించింది. ఈ రాయితీలపై వాహన షోరూమ్‌ల వద్ద ఆయా సంస్థలు బోర్డులు పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు రవాణా శాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించిన ఆయన కీలక సూచనలు చేశారు. అలాగే, 'మహాలక్ష్మీ' పథకం అమలుతో ఆర్టీసీ లాభాల బాట పట్టిందని టీజీఆర్టీసీ అధికారులతో నిర్వహించిన మరో సమీక్షలో మంత్రి పేర్కొన్నారు.

## ప్రభుత్వాలు శాశ్వతం కాదు..
## పోలీసులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హితవు



సీఎం రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉన్న సాయిరెడ్డి భౌతిక కాయానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నివాళులర్పించారు. సాయిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. తన చావుకు సీఎం రేవంత్ రెడ్డి బ్రదర్స్ కారణమని సాయిరెడ్డి తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారని తెలిపారు. అయినప్పటికీ పోలీసులు 108 బీఎన్ఎస్ కింద కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం బ్రదర్స్ రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని.. రాజ్యాంగానికి లోబడి విధులు నిర్వహించాలని పోలీసులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హితవు పలికారు. సాయిరెడ్డి మృతికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్యాయానికి గురైన వారి తరఫున బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ



**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. స్వామి వారిని దర్శించుకోడానికి ప్రముఖులు, భక్త జనం పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ధర్మ దర్శనానికి సుమారు 2 గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పడుతోంది. దీంతో క్యూ లైన్‌లో భక్తులు వేచి ఉన్నారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి క్షేత్రం ఆదివారం భక్తజనసంద్రమైంది. కార్తీక మాసం, వారాంతపు సెలవుదినం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో క్షేత్రానికి చేరుకున్నారు. స్వామి వారి నిజాబిషేకం, అర్చన, నిత్య కళ్యాణం, శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రత పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వాహనాలతో పార్కింగ్ స్థలం నిండిపోగా క్షేత్రం చుట్టూ ఉన్న రింగ్‌రోడ్డులో కూడా వాహనాలను పార్కింగ్ చేశారు. కార్తీకమాసం పురస్కరించుకొని సత్యదేవుడి వ్రతాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధన స్థలాల్లో భక్తులతో రద్దీ నెలకొంది. కొండపైన గర్భాలయంలో పాంచనారసింహులతోపాటు శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, క్యూకాంప్లెక్స్‌లతోపాటు ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, శివాలయం, ప్రసాద విక్రయశాల, కొండకింద వ్రత మండపం, లక్ష్మీపుష్కరిణి, అన్నదాన సత్రం, కల్యాణ కట్ట తదితర ప్రాంగణాలు భక్తులతో రద్దీగా మారాయి. ఆలయ ఉత్తర దిశలో ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీపడ్డారు. అదేవిధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు.

## దారుణం..
## న్యాయం కోసం వెళ్తే మహిళపై లైంగిక వేధింపులు..




హైదరాబాద్: బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు గాడి తప్పుతున్నారు. చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన పోలీసులే వాటిని తుంగలో తొక్కుతున్నారు. న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఓ మహిళకు దారుణ పరిస్థితి ఎదురైంది. సమస్య పరిష్కరించాలని ఎస్సై వద్దకు వెళ్లడం ఆమెకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. స్టేషన్ మెట్లు ఎక్కడమే ఆమె చేసిన పాపంగా మారిపోయింది. న్యాయం కోసం వెళ్తే చివరికి అన్యాయానికి గురైంది. ఎస్సై వేధింపులు తాళలేక సదరు మహిళ ఉన్నాతాధికారులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ హయత్ నగర్?కు చెందిన ఓ మహిళ భర్త వేధింపులు తట్టుకోలేక స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు 40 రోజుల కిందట వెళ్లింది. తన ఘోడు మ్రొత్తం ఎస్సై ఎదుట వెల్లబోసుకుంది. భర్త వేధింపుల గురించి పూస గుచ్చినట్లు ఆయనకు వివరించింది. భర్తపై ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరింది. అయితే ఫిర్యాదు నెపంతో మహిళ ఫోన్ నంబర్‌ను ఎస్సై తీసుకున్నాడు. ఆమెకు తరచూ ఫోన్లు చేస్తూ మాటలు కలిపే ప్రయత్నం చేశాడు. మెల్లిగా తన వక్రబుద్ధి మహిళ ఎదుట బయటపెట్టాడు ఆ ఎస్సై. కేసును తాను పరిష్కరిస్తానని, కాకపోతే కోరిక తీర్చాలంటూ పట్టుపట్టాడు. ఇంటికి వస్తానని, ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చెప్పాలంటూ మహిళను వేధించడం మ్నొదలుపెట్టాడు. తరచూ ఆమెకు వాట్సాప్ కాల్స్ చేస్తూ ఇబ్బందులకు గురి చేశాడు. ఆమె భర్తపై కేసు నమోదు చేయాలంటే కోరిక తీర్చాల్సిందే అంటూ పదేపదే ఆమెను హింసించాడు. ఘటనపై విసిగు చెందిన సదరు మహిళ రాచకొండ కమిషనర్ సుధీర్ బాబును ఆశ్రయించింది. ఎస్సై వేధింపులపై ఫిర్యాదు చేసింది. గత 40 రోజులుగా కోరిక తీర్చాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ సీపీకి ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో ఆ మహిళను ఎస్సై పోలీస్ స్టేషన్ పిలిపించి బెదిరింపులకు దిగాడు. విషయం బయటకు చెప్పొద్దంటూ ఆమెను భయాందోళనలకు గురి చేశాడు. అయితే ఎస్సైపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, తనను ఆ ఎస్సై నుంచి కాపాడాలని మహిళ వేడుకుంటోంది.

సంపాదకీయం

# ఎఐతో మత్స్యరంగానికి లాభమా?

భారత దేశంలో తరతరాలుగా కోట్లాది మందికి ఉపాధిని అందించడంతో పాటుగా ఆరోగ్యకరమైన పౌష్టిక మాంసాహారాన్ని అందిస్తున్న మత్స్యరంగం మీద కృత్రిమ మేధస్సు సునామీలా విరుచుకుపడబోతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నవంబర్ 8వ తేదీన కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్ నగరంలో కేంద్ర సముద్ర జలవనరుల మత్స్యపరిశోధనా కేంద్రం (సిఎంఎఫ్ఆర్ఐ)లో నిర్వహించిన మత్స్యకారుల చైతన్య సదస్సు సందర్భంగా కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ కృత్రిమ మేధస్సు ఆధారిత ఉపరితల డ్రైన్ యంత్ర పరికరాన్ని ప్రదర్శించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వాస్తవానికి 2024 సంవత్సర ఆరంభంలోనే జనవరి 5వ తేదీన ఇదే ప్రాంగణంలో 'నీతిఆయోగ్' జాతీయ ఉపాధ్యక్షులు సుమన్ భేరీ సమక్షంలో జరిగిన సమాలోచన సందర్భంలోనే మత్స్యరంగం అభివృద్ధికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం (కృత్రిమ మేధస్సు) సహాయంతో ఉపరితల డ్రోన్లు, రోబోటిక్ యంత్ర పరికరాలు, జలాంతర్గాముల్లాంటి' అండర్ వాటర్ డ్రోన్ల'ను ఉపయోగించుకుని దేశంలోని ఆక్వాకల్చర్, మత్స్యరంగాలలో సాధించగలిగే పురోభివృద్ధిపై మేధోమథనం జరిగింది. తొలిదశలో ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ కృత్రిమ మేధస్సు ఎఐ) సముద్ర తీరప్రాంతాలను కలిగి ఉన్న రాష్ట్రాలలో మాత్రమే వినియోగించాలని నిర్దేశించుకున్నట్లు బహిరంగ పరుస్తున్నప్పటికీ, తదనంతర విస్తరణలో భాగంగా చేపల ఉత్పత్తితో ముడిపడి ఉన్న అన్ని ప్రక్రియలలోనూ, దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ ఉపయోగించవలసిన తప్పనిసరి పరిస్థితులు నెలకొంటాయని ఈ రంగం మీద పరిశోధనలు నిర్వహిస్తున్న మత్స్యరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొచ్చిన్‌లో కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత క్రేన్ల పని తీరును ప్రదర్శించిన సందర్భంగా కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి ప్రస్తావించిన అంశాల సారాంశం ప్రకారం, సముద్రంలో మత్స్యకారులు పట్టిన చేపలను సునాయాసంగా ఒడ్డుకు చేర్చడానికి, చేపలవేటకు వెళ్లిన జాలర్లకు సంబంధించిన మర పడవలకు రక్షక కవచంగా వినియోగించడానికి, నడిసముద్రం లో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదంలో చిక్కుకున్న సందర్భాలలో వారిని సురక్షితంగా ఒడ్డుకు చేరవేసేందుకు, సముద్రంలో చట్ట వ్యతిరేకంగా నిర్వహించే చేపల వేటను నిలువరించేందుకు, సముద్రంలోని చేపల ఆరోగ్యాలను సంరక్షించేందుకు అనుగుణంగా ఈ డ్రోన్లను వినియోగిస్తారు. ఫలితంగా సముద్రంలో చేపలుపట్టే మత్స్యకారులకు ఈ డ్రోన్లు అన్ని రకాలుగా సహాయకారిగానూ, రక్షక కవచంగానూ, శ్రమను తగ్గించే విధంగానూ, సముద్రంలో పట్టిన చేపల నాణ్యతను కాపాడే విధంగానూ, సకాలంలో సముద్రం నుండి చేపలను మార్కెట్‌కు చేర వేసేందుకుగానూ ఉపయోగపడతాయి. అంతేకాకుండా, సముద్ర గర్భంలో వినియోగించే అండర్ వాటర్ డ్రోన్ల సహకారంతో చేప పిల్లల ఆరోగ్య, ఆహార సమస్యలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడంతోపాటుగా అందుకు సంబంధించిన తరుణోపాయాలను కూడా అమలుపరుస్తారు. ఈ పనుల పర్యవసానంగా నానాటికీ తగ్గుముఖం పడుతున్న సముద్రచేపల ఉత్పత్తులను ఇబ్బడిముబ్బడిగా పెంచుకోవడంవల్ల మత్స్యకారుల ఆదాయ వనరుల్లో గణనీయమైన వృద్ధిరేటును సాధించేందుకు అవకాశాలు మెరుగుపడతాయి. ఇక కృత్రిమ మేధస్సు అనుసంధానంతో నిర్వహించే రోబోటిక్ యంత్రాలు సముద్రంలో కేజ్ కల్చర్ లాంటి ఆధునిక చేపల పెంపకానికి సంబంధించిన అనేక క్లిష్టమైన విధులను ఎంతో సమర్ధవంతంగానూ, సులభంగానూ నిర్వహిస్తాయి. సముద్రంలో ఆధునిక పరిజ్ఞానంతో నిర్వహించే కేజ్ కల్చర్‌ను మానవ రహిత డ్రోన్ పరికరాలు, రోబోటిక్ యంత్రాలు, అండర్ వాటర్ డ్రోన్ల సహకారంతో రిమోట్ కంట్రోల్ ఆపరేషన్ల పద్ధతిలో సముద్రతీరం నుండి నిర్వహిస్తారు. మొత్తంగా మత్స్యకారుల ప్రమేయం లేకుండానే సముద్రంలో కృత్రిమ పద్ధతులలో, కృత్రిమ మేధస్సు వినియోగంతో చేపల పెంపకానికి సంబంధించిన ప్రక్రియలన్నింటినీ నిర్వహించగలుగుతారు. మత్స్యకారులకు సహాయకారిగా ప్రారంభమయ్యే కృత్రిమ మేధస్సు అంతిమంగా మత్స్యరంగాన్ని తన గుప్పిట్లోకి బిగించుకుంటుంది. కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా సముద్ర జలవనరుల చేపల పెంపకానికి సంబంధించిన కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేయనున్నట్లుగా ఉన్నతాధికార వర్గాలు నమ్మబలుకుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మత్స్యశాఖ రానున్న నాలుగు సంవత్సరాల కాలానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించడానికి ఉపరితల జలవనరులకు సంబంధించిన మత్స్య రంగాలకు కూడా ఈ అత్యాధునిక ఆవిష్కరణలు పరోక్ష పద్ధతుల్లో చొరబడటం ఖాయంగా కనిపిస్తున్నది. దేశవ్యాప్తంగా విస్తరించుకుని, సాంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధికి జీవనాడిగా ఉపయోగపడుతున్న చెరువులు, కుంటలు, వాగులు, వంకలు లాంటి చిన్న నీటి వనరులలో ఎఐ లాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు అవకాశాలు పెద్దగా లేకపోయినప్పటికీ పెద్దపెద్ద చెరువులు, భారీజలాశయాలు, ప్రాజెక్టులకు సంబందించిన బ్యాక్ వాటర్స్‌లలోను, నీటిపారుదల ప్రాజెక్టులులాంటి నీటి వనరులలో చేపట్టి చేపల పెంపకానికి సంబంధించిన కార్యకలాపాలలో అనివార్యంగా కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక ఉపకరణాలు, అత్యాధునిక యంత్రాలు వినియోగంలోకి తీసుకురావడం అనివార్యంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా మన దేశం నుండి ఇతర దేశాలకు చేపలను, చేపల ఆహారాన్ని ఎగుమతులను భారీ ఎత్తున పెంపొందించడం ద్వారా సమీప భవిష్యత్తులో లక్ష కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రప్రభుత్వం సముద్ర జలాల నుండి ఉత్పత్తి చేసి ఆక్వా ఉత్పత్తులతో పాటుగా, ఉపరితల జలవనరుల నుండి చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచుకోవాలని ఆలోచిస్తున్నది. ప్రధాన మంత్రి పెంట చేపట్టి అమలుపరుస్తున్న పిఎంఎంఎస్‌వై, పిఎంకెఎస్ఎస్‌పై ద్వారా అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన అంతర్గత లక్ష్యాలు కూడా ఇందుకు అనుకూలంగానే ఉన్నాయి. ఉపరితల జలవనరుల నీటి విస్తీర్ణంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తున్న తెలంగాణ లాంటి కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలోని రిజర్వాయర్లు, నీటిపారుదల ప్రాజెక్టులలో అత్యాధునిక పద్ధతులను అమలు పరచడం ద్వారా చేపల ఉత్పత్తిని భారీ యెత్తున పెంచేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. ప్రతి హెక్టారుకు కనీసం మూడు నుండి ఐదు టన్నుల చేపలను పెంచేందుకు అవకాశాలున్నప్పటికీ, తెలంగాణలో మాత్రం హెక్టారుకు టన్ను చేపలను కూడా ఉత్పత్తి చేయలేకపోతున్నారని, ఇందుకు ఇక్కడి సాంప్రదాయ మత్స్యకారుల్లో వృత్తి నైపుణ్యం లేకపోవడమే ప్రధాన కారణంగా ఈ – రంగానికి సంబంధించిన నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సిరిసిల్ల జిల్లా కేంద్రానికి అనుకుని నిర్మించిన మిడ్ మానేర్ డ్యాం (యంయండి) పరీవాహక ప్రాంతంలో ప్రయోగాత్మకంగా ఒక పిషరీస్ హట్ ను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం విఫలయత్నం చేసింది. అయితే స్థానికంగా పరిస్థితులు అనుకూలించకపోవడం, తదితర కారణాలవ ల్ల మిడ్ మానేరులో భారీ పెట్టుబడులతో పెద్ద ఎత్తున నిర్వహించతల పెట్టిన కేజ్ కల్చర్ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అప్పటి ప్రభుత్వం ఆచరణలోకి తీసుకురాలేకపోయింది. తెలంగాణలో కేజ్ కల్చర్ పద్ధతులను పెద్ద ఎత్తున అమలులోకి తీసుకురావడానికి ఇక్కడి మత్స్యశాఖ చేసిన ప్రయత్నాలన్నీ కూడా ఏ మాత్రం ఆశించిన ఫలితాలను సాధించలేకపోయాయి. పైగా స్థానిక మత్స్యకారుల్లో కేజ్ కల్చర్ అనే అధునాతన పద్ధతి ఇక్కడి పరిస్థితులకు అనుకూలం కాదనే దురభిప్రాయం స్థిరపడిపోయింది. రీ–సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టం (ఆర్ఎఎస్), బయో ఫ్లాక్ ఫిష్ ఫార్మింగ్ టెక్నాలజీ పెన్ కల్చర్, రేస్ వేస్ లాంటి ఇతర రకాలైన ఆధునిక చేపల పెంపకానికి సంబంధించిన ప్రయోగాల విషయంలోనూ కేజ్ కల్చర్ లాంటి అనుభవాలే ఎదురయ్యాయి. ఆ శాఖకు సంబంధించిన అధికారుల్లో సరైన అవగాహన, దీక్షాదక్షతలు లేని కారణంగానే. తెలంగాణ మత్స్యరంగంలో ఆధునిక విధానాల పట్ల ఇక్కడి సాంప్రదాయ మత్స్యకారుల్లో నిర్లిప్త ధోరణులు ప్రబలిపోవడానికి మరో ప్రధాన కారణంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# నిరసనలపై 'స్వాట్' యుద్ధం




బాధితులు, వారి మద్దతుదార్లు తమకు పరిహారాన్నివ్వమని అడగడం, సమస్యలపై మాట్లాడ్డం, అభిప్రాయాలను పంచుకో వడం, తప్పుని ప్రశ్నించడం నేరంగా భావిస్తున్న సమాజంలో మనమిప్పుడు బతుకుతున్నాం. మోడీ ప్రభుత్వం ప్రయోగిస్తున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) అయినా, వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన, తాజాగా టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఊపిరి పోసి అమలుకు సిద్ధపడుతున్న స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (స్వాట్) టీమ్ అయినా ప్రజాస్వామిక హక్కులను అణచివేయడానికి ఉపయోగిస్తున్నవన్నీ ముమ్మాటికీ నిరంకుశమైనవి. అప్రజాస్వామిక మైనవి. సంపన్నులు, పారిశ్రామికాధిపతుల మెప్పు కోసం సాధారణ ప్రజలు, కార్మికుల హక్కులను అణచివేసే విపరీత వైఖరి కూటమి ప్రభుత్వం తీసుకుంది. కార్మికుల ఆందోళనల ను, నిరసనలను అణచివేయడానికి స్వాట్ టీమ్‌తో పోలీసు బలగాలను మోహరించి భయభ్రాంతులు సృష్టించడానికి ప్రభుత్వం సిద్ధమైంది. పౌర హక్కులు, కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న అప్రజాస్వామిక పాలకవర్గ నిర్ణయాలపై పోరాడే గొంతులను నొక్కేందుకు దేశంలో యుఎపిఎ తీసుకొచ్చినట్లు, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం స్వాట్ టీమ్‌కు రాష్ట్రంలో ఊపిరి పోసింది. వైసిపి ప్రభుత్వ నిర్ణయాలను తూర్పారబడుతున్న కూటమి ప్రభుత్వం దానికి భిన్నమైన ప్రజాస్వామిక పద్ధతులను పటిష్టం చేసేలా ప్రవర్తించడంలేదు. కార్పొరేట్ శక్తులకు ఆర్థిక ప్రయోజనం కల్గించడానికి పరిపాలన సాగిస్తోంది. అనకాపల్లి జిల్లాలో కొద్ది రోజుల క్రితం స్వాట్ టీమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయించింది. హోం మంత్రి అనిత సొంత జిల్లాలో ఈ తరహా టీమ్ ఏర్పాటు కావడం కాకతాళీయం కాదు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఏర్పాటు చేసింది. అనకాపల్లి జిల్లాలో ప్రధానంగా తీర ప్రాంతంలో మత్స్యకారులు, రైతులు, ఇతర ప్రజానీకం నుంచి రానున్న ప్రతిఘటనను ఎక్కడికక్కడ అణచివేసేందుకు, ముందుగా భయభ్రాంతులకు గురిచేసి తమ సమస్యలపై మాట్లాడుకోవడానికి, ఒకచోట కూర్చొని చర్చించుకోవడానికి వీల్లేని వాతావరణం సృష్టించడానికి స్వాట్ ఏర్పాటు చేసింది. కార్మికుల రక్షణ, భద్రతను యాజమాన్యాలు పట్టించుకోకపోవడం, పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలలో మృతి చెందడం, గాయపడ్డం, పర్యావరణ ప్రమాణాలు పాటించకపోవంతో పరిసర ప్రాంత ప్రజలు వివిధ రకాల సమస్యలు, వ్యాధులతో బాధ పడుతున్నారు. వీటికి తోడు తీరంలో కాలుష్య విషతుల్యమైన బల్క్ డ్రగ్ పార్కు సహా కాలుష్య కారక పరిశ్రమల ఏర్పాటుకు అనేక రాయితీలు, అవకాశాలు పారిశ్రామికాధిపతులకు కల్పించ బూనుకుంది. ఇప్పటికే పరిశ్రమల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు, విద్యార్హత కల్గిన యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించడంలేదు. ఇవి స్థానికులకు ఆగ్రహాన్ని కల్గిస్తున్నాయి. ప్రభుత్వాలపై అసంతృప్తిని రగిలిస్తున్నాయి. భూమి లేక, ఉపాధి చూపకపోవడంతో బతుకు తెరువు పోయిన బాధిత కుటుంబాలు నిత్యమూ సంఘర్షణకు లోనవుతున్నారు. వీరు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. ఆందోళనకు దిగుతున్నారు. భూములు తీసుకొని ఉపాధి చూపకుండా ఇంతవరకు నిర్వాసితులు, మత్స్యకారుల పొట్ట కొట్టిన ప్రభుత్వం, ఇప్పుడు ప్రభుత్వ తప్పిదాలు బాహ్య ప్రపంచానికి తెలీకుండా నిరసనలు, ఆందోళనలు నిర్దాక్షిణ్యంగా అణచివేసేందుకు అనకాపల్లి జిల్లాను ఎంచుకుంది. ముఖ్యమంత్రి, మంత్రులు పర్యటనకు వచ్చినప్పుడు ప్రజలు, కార్మికుల తరపున సమస్యలు చెప్పుకొనే వీల్లేకుండా సిఐటియు, సిపిఎం, ఇతర ప్రజా సంఘాల నాయకులను బయటకు రానివ్వడంలేదు. కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు పరవాడ వచ్చినప్పుడు, అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ అక్రమ లేఆఫ్ ఎత్తివేసి ఉపాధి కల్పించాలని వినతిపత్రం ఇవ్వడానికి బయల్దేరిన కార్మికులు, సిఐటియు నాయకత్వాన్ని అచ్యుతాపురం పొలిమేర దాటనివ్వలేదు. సెజ్‌లో కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకొనే హక్కు ప్రభుత్వం లేకుండా చేసింది. కనీసం వారి సమస్యలపై మాట్లాడే హక్కు, పరిష్కరించుకొనే సమాలోచన చేయకుండా ప్రజాస్వామిక హక్కులపై ప్రభుత్వం దాడిచేస్తోంది. ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా స్వేచ్ఛ, ఇతరుల జోక్యం లేకుండా సొంత అభిప్రాయాలు చెప్పే హక్కు వుందని రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 చెబుతోంది. ప్రతి ఒక్కరికీ పని చేయడానికి, సమాన పనికి సమాన వేతనం, తన ప్రయోజనాలను కాపాడుకోవడా ంంనికి కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకొని, చేరే హక్కు ఆర్టికల్ 23 (1) కల్పించింది. రాజ్యాంగం పౌర హక్కులపై భరోసా ఇచ్చినప్పటికీ, కార్పొరేట్ సంస్థలు, పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం ఆ హక్కులకు భంగం కల్గించేలా ప్రభుత్వాలు కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలుచేసిన చంద్రబాబు నాయుడు, ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పారిశ్రామిక ప్రగతి సాధిస్తామని చెబుతున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానం కొద్దిమంది పారిశ్రామికా ధిపతులు లాభపడ్డానికి ఉపయోగపడింది తప్ప పారిశ్రామిక వృద్ధికి దోహదపడలేదు. ఉపాధి కల్పన, వేతనాల మెరుగుదలలో దిగుజారుడుతనమే గానీ పురోగతి లేదు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరిట కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కు లేకుండా చేయజూస్తున్నారు. ఫ్యాక్టరీల్లో ప్రమాదాల వల్ల కార్మికులు చనిపోయినా, అంగవైకల్యం పొందినా, వారికి పరిహారం ఇవ్వాలని ఆందోళనలు, నిరసనలు చేసే వారిని భయపెట్టి, చెదరగొట్టేందుకు స్వాట్ టీమ్ ఏర్పాటు చేశారు. పరిశ్రమల్లో స్వతంత్రంగా వెళ్లి తనిఖీలు నిర్వహించే అధికారం, వేతనాల అమలు పర్యవేక్షణాధికారం%ొ%పరిశ్రమల తనిఖీ అధికారులు, కార్మిక శాఖాధికారులకు ప్రభుత్వం లేకుండా చేసింది. కార్మికులు తమ సమస్యలపై ఆందోళన చేసిన సందర్భాల్లో కార్మిక శాఖాధికారులు జోక్యం చేసుకోవాలి తప్ప, శాంతి భద్రతలు కాపాడే పేరుతో పోలీసులు బలప్రయోగంతో ఉద్యమాలను అణచివేయడం పారిశ్రామికాభివృద్ధికి దోహదపడదు. పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్, ఇతర ఔషధ, రసాయన పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తూనే వున్నాయి. ఎసెన్షియా ప్రమాదంలో 17 మంది చనిపోయి, 38 మంది గాయపడినా, సినర్జిస్ ఫార్మా ప్రమాదంలో నలుగురు చనిపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వడం లేదు. పని ప్రదేశంలో భద్రత లేదు. ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ అమలు చేయడం లేదు. ఇవి అమలు చేయని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు లేవు. తమ హక్కులను అమలు చేయాలని కోరిన కార్మికులు, కార్మిక సంఘాల నాయకులపై నిర్బంధం ప్రయోగించడం, అక్రమ కేసులు పెట్టడం కొనసాగుతోంది. ప్రభుత్వ విధానాలతో పెరుగుతున్న భారాలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడి, పోరాడి, నిరసన తెలిపే హక్కు లేకుండా స్వాట్ టీమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఎక్కడైనా ఎవరు నిరసన తెలిపినా స్వాట్ టీమ్ రెప్ప పాటులో వాలిపోయి చెల్లాచెదురు చేయనుంది. నిర్బంధ పద్ధతులను ప్రభుత్వం విడనాడి, కార్మికుల సంక్షేమం, శ్రేయస్సును యాజమాన్యంతో అమలు చేయించి, తగిన వాతావరణాన్ని నెలకొల్పే పారిశ్రామిక, కార్మిక విధానాలను అమలు చేయాలి. ఆ విధానాల రూపకల్పనలో కార్మిక సంఘాల ప్రతినిధులను భాగస్వాములు చేయాలి. పరిశ్రమల ప్రోత్సాహం పేరుతో పరిశ్రమాధిపతుల ప్రయోజనాల కోసం ఏకపక్ష, అప్రజాస్వామిక విధానాలను అమలు చేయడానికి ప్రభుత్వం అడుగులు వేస్తే కార్మిక వర్గం, పౌర సమాజం ప్రతిఘటించకుండా వుండలేదు.

# అధిక సంతానం పరిష్కారమా?

మరింత మంది పిల్లలను కనమని దంపతులకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాజాగా మరోసారి పిలుపునిచ్చారు. గత ఆరు సంవత్సరాల క్రితం ఆయన ఇదే మాట మాట్లాడారు. అప్పుడు మాట్లాడింది 15వ ఆర్థిక సంఘం కేంద్ర నిధుల కేటాయింపుకు, జనాభాకు ముడిపెట్టినప్పుడు. ఇప్పుడు మాట్లాడుతుంది 2026లో జనాభా ఆధారంగా కేంద్ర నిధుల కేటాయింపుతో పాటు పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజన గురించి కేంద్రం నిర్ణయిస్తున్నపుడు. చిన్న కుటుంబం చింతల్లేని కుటుంబమనేది పాత సామెత, పెద్ద కుటుంబం సంతోష కరమైన కుటుంబమనేది నేటి సామెత అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యగ్యంగా చెబుతూనే సంతానాన్ని పెంచమని తమిళ ప్రజలను కోరారు. జనాభా నియంత్రణలో అద్భుత విజయాలను సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు జరిమానా విధిస్తారా అంటూ చాలామంది మేధావులు, ఆర్థికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. కేంద్రం అలా చేస్తే జనాభా పెరగడం తప్ప మాకు వేరే దారి లేదని మరి కొందరు వాదిస్తున్నారు. ఈ వాదనల్లో రెండు అంశాలు ఉన్నాయని రిజర్వు బ్యాంకు మాజీ చైర్మన్ దువ్వూరి సుబ్బారావు విశ్లేషించారు. ఒకటి ఆర్థిక అంశాలు, రెండు రాజకీయాలు. రాజ్యాంగం ప్రకారం మన దేశం రాష్ట్రాల సమాఖ్య (ఫెడరల్) విధానం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సిన బాధ్యతలను కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాల్లో రాజ్యాంగం నిర్దేశించింది. ఈ బాధ్యతలను అమలు చేయడానికి నిధుల పంపిణీ గురించి కూడా అందులో పేర్కొన్నారు. కాంగ్రెసు రాజకీయ ఆధిపత్య కోణం నుండే రాష్ట్రాలను తమ ఆధీనంలో వుంచుకోవాలని చూస్తే, బిజెపి మాత్రం తన మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఆధారంగా, కార్పొరేట్ శక్తుల ఆర్థిక ప్రయోజనాల కోసం రాష్ట్రాలను బలహీనం చేస్తున్నది. వాజ్‌పేయి పాలనా కాలంలో అధ్యక్ష తరహా విధానాన్ని అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నించి భంగపడ్డారు. ఇదే విధానాన్ని మోడీ కొత్త రూపాల్లో అమలు చేస్తున్నారు. ఒకే పన్ను, ఒకే భాష, ఒకే మతం, ఒకే విధానం, ఒకే ఎన్నిక ఇలా ఒకేలన్నీ అర్ఎస్ఎస్ ఎజెండాలోని కేంద్రీకృత పాలనకు 'ఓకే' చెప్పడంలో భాగమే. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేయడం, నీతి ఆయోగ్ పేరుతో కేంద్ర దయాదాక్షిణ్యాల మీద రాష్ట్రాలు ఆధారపడేటట్లు చేయడం, ప్రపంచ బ్యాంకు ద్వారా రాష్ట్రాలకు అప్పులు ఇప్పిస్తూ తమ గుప్పిట్లో పెట్టుకోవడం జరుగుతుంది. తాజాగా జనాభా లెక్కల ఆధారంగా కేంద్ర నిధుల పంపిణీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన ఎజెండాను తెర పైకి తెచ్చారు. ఇందు కోసం 2025లో జనాభా లెక్కలు సేకరిస్తారు. ఆ జనాభా ఆధారంగా 2026 నుండి కేంద్ర నిధులు, పార్లమెంట్ సీట్లు నిర్ణయిస్తారు. దీనివల్ల జనాభా తక్కువగా వున్న దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ప్రస్తుత దేశ జనాభాలో సగం మంది 25 సంవత్సరాల వారే. దేశ జనాభా మధ్యస్త వయస్సు 28.4 సంవత్సరాలు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా వున్న దేశం మనది. అయితే ఈ పరిస్థితి దేశమంతా ఒకే విధంగా లేదు. జనాభా నియంత్రణ కోసం 1952లో ఏర్పడిన కుటుంబ నియంత్రణ జాతీయ కార్యక్రమాన్ని దక్షిణాది రాష్ట్రాలతో పాటు, మరికొన్ని ఈశాన్య రాష్ట్రాలు సమర్ధవంతంగా అమలు చేయడంతో ఆయా రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల తగ్గింది. జనాభా ఆధారంగా కేంద్ర నిధులు అంటే ఈ రాష్ట్రాలు నష్టపోతాయి. అందుకే 1971 జనాభా లెక్కల ఆధారంగా ఈ రాష్ట్రాలకు 25 శాతం వెయిటేజీ (అదనపు సౌకర్యం) ఇవ్వాలని 1976లో కేంద్రం నిర్ణయించింది. 13వ ఆర్థిక సంఘం వరకూ ఇదే విధానం కొనసాగింది. 2013లో రిజర్వుబ్యాంకు మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వై.వి.రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన 14 ఆర్థిక సంఘం ఈ 25 శాతం వెయిటేజీని 17.5 శాతానికి తగ్గించి, 2011 జనాభా లెక్కలకు 10 శాతం వెయిటేజీ ఇచ్చింది. ఈ విధానం దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక స్థితిని దిగజార్చింది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ రాష్ట్రాలు 13వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధుల కంటే 14వ ఆర్థిక సంఘం ఇచ్చిన నిధుల్లో సంవత్సరానికి సుమారు 6 నుండి 8 వేల కోట్లు నష్టపోయాయి. 1971 నుండి 2011 మధ్య ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో జనాభా రెట్టింపు కాగా, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో గణనీయంగా తగ్గింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జనాభా పెరుగుదల మందగించింది. 'జనాభా పేరుతో రాష్ట్రాలకు శిక్ష వేస్తారా?' అని 2018 ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయు డు ఢిల్లీలో విలేకరుల సమావేశం పెట్టి మోడీని ప్రశ్నించారు. ఇదే నెలలోనే తెలంగాణ అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ –కేంద్రానికి మనం ఇస్తున్న పన్నుల్లో సగం కూడా తిరిగి కేంద్రం మనకు ఇవ్వడంలేదని, ఉత్తరాది రాష్ట్రాల కోసం మనం కష్టపడాల్సి వస్తుందని– ఘాటుగా మాట్లాడారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు కూడా 14వ ఆర్థిక సంఘం నిర్ణయంపై తీవ్రంగా నిరసన వ్యక్తం చేసాయి. 2005–10 మధ్య కేంద్రం రాష్ట్రాలకు ఇస్తున్న గ్రాంట్స్ లెక్కల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు రూ.1,33,471.45 కోట్లు, బీహార్‌కు రూ.75,648.83 కోట్లు ఇవ్వగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.50,353.26 కోట్లు, కేరళకు రూ.19,607.72 కోట్లు మాత్రమే కేటాయించారు. దేశ జనాభాలో 16.30 శాతం వున్న ఉత్తరప్రదేశ్ దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి)లో కేవలం 8.4 శాతం వాటాను మాత్రమే కలిగి ఉంది. జనాభాలో కేవలం 2.76 శాతం వున్న కేరళ దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో 3.8 శాతం వుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో 2023–24లో 30 శాతానికి పైగా వాటా కలిగి వున్నాయి. ఇప్పటి వరకు జనాభాకు అదనంగా అనుసరిస్తున్న వెయిటేజీ విధానంలోనే దక్షిణాది రాష్ట్రాలతో పాటు, మరికొన్ని చిన్న రాష్ట్రాలు నష్టపోతుంటే 2026 తర్వాత జనాభా లెక్కల ఆధారంగానే నిధులు కేటాయిస్తే మా పరిస్థితి ఏమిటనేది ఈ రాష్ట్రాల ఆందోళన. కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న జనాభా ఆధారిత నిధుల కేటాయింపు, పార్లమెంట్ స్థానాల పునర్విభజన అనేది ప్రపంచీకరణ, మతతత్వ విధానాల అమలులో భాగమే. 1991 నుండి దేశంలో అమలులోకి వచ్చిన ప్రపంచీకరణ విధానాలు అన్ని రాష్ట్రాలను అప్పుల్లో ముంచాయి. రోజువారీ అవసరాలకు కూడా కేంద్రం దగ్గర లేదా ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ బ్యాంకుల దగ్గర దేబిరించాల్సిన పరిస్థితి వచ్చింది. అలాంటి పరిస్థితులు ఎంత బలంగా వుంటే అంతగా ఈ ఆర్థిక సంస్థల షరతులకు రాష్ట్ర ప్రభుత్వాలు లొంగిపోతాయి. కాబట్టే కేంద్రం నుండి గ్రామ పంచాయితీ వరకు ప్రపంచ బ్యాంకు విధానాలు, షరతులు వేగంగా అమలవుతున్నాయి. ఇటీవల మన రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపం చ బ్యాంకు ద్వారా ఇప్పించే రూ.15 వేల కోట్లను పార్లమెం ట్‌లో దేశ ఆర్థికమంత్రి ఎంత ఘనంగా చెప్పారో, రాష్ట్ర ప్రభుత్వం ఎంత తన్మయత్వంతో స్వాగతించిందో చూశాం. ఎన్నికల సందర్భం గా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు, రోజువారీ ఖర్చులకు కూడా కేంద్రం మీద రాష్ట్రాలు ఆధారపడేటట్లు చేయడం ద్వారానే దేశమంతా ఒకే విద్యుత్, విద్య, వైద్యం, రవాణా, గనుల విధానం అమలు చేయించి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ఈ రంగాలను సులభంగా హస్తగతం చేస్తున్నారు.

# పట్టణాన్ని అభివృద్ధి చేస్తా

## పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు.

## రూ.2.11 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి :** పెద్దపల్లి పట్టణ ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 15,16,17, 18 వార్డులల్లో రూ. 2.11 కోట్ల టియుఎఫ్ ఐడిసి నిధులతో చేపట్టే సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల పనులను స్థానిక నాయకులతో కలిసి బుధవారం శంకుస్థాపనలు చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నేతేట్ల కొమురయ్య, రాజం మహంత, కోలిపాక సంధ్య చిరంజీవి, కోలిపాక శ్రీనివాస్, ,భూతగడ్డ సంపత్, సయ్యద్ మసర్త్,సుభాష్ , శ్రీమాన్, తోట శంకర్, గంగుల వెంకటేష్, నామాని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.



# ఘనంగా కార్తీక మాస వన మహోత్సవం.

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ లో గల సానా గార్డెన్లో కార్తీకమాస వనమహోత్సవం ఆదివారం కమ్మ కుల బాంధవులు ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లాలో గత 50 సంవత్సరాలుగా నివసిస్తున్న ఆంధ్ర నుండి వలస వచ్చిన కమ్మ కుల బంధువుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కమ్మవారి కార్తీక వన సమార మహోత్సవంలో పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న కమ్మ కులస్తులు సుమారు 250 మంది వన మహోత్సవం నిర్వహించి వనభోజనాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉసిరి చెట్టుకు పూజ చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అందరు కలిసి ఒకే చోట కార్తీకమాసం వనభోజనాల్లో పాల్గొన్నారు. ఇందులో పెద్దపల్లి జిల్లాలో నివసిస్తున్న వ్యవసాయదారులు ,సింగరేణి, ఉద్యోగులు ఎన్టీపీసీ , ఎఫ్సీఐ, గోదావరిఖని ,ప్రశాంత్ నగర్, మారుతి నగర్ ,శ్రీరామ్ నగర్



,నుండి భారీ ఎత్తున తరలివచ్చారు. అలాగే చిన్నారులు చేసిన భరతనాట్యం కూచిపూడి నృత్యం పలువురిని ఆకర్షించింది. అలాగే చిన్నారులకు నిర్వహించారు. క్విజ్ పోటీలను నిర్వహించి చిన్నారులకు బహుమతులను అందజేశారు. కమ్మ కుల బంధువులు అందరూ కలిసి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా గార్డెన్ అధినేత సానా రామకృష్ణ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమ్మ కులస్తుల రాష్ట్ర సంఘం కమిటీ సభ్యుడు వేణుగోపాల్ శావ నరసింహారావు, పెద్దపల్లి జిల్లా కమిటీ మన్నె రవికుమార్, కంటిపూడి రామకృష్ణ, ముప్పారపు శ్రీనివాస్, యార్లగడ్డ వెంకట రాంబాబు, కట్ట రామారావు, వెంకటరమణ ,గుడవర్తి గోవిందు ,పెండ్యాల రాంబాబు, సూర్యదేవర జ్యోతి ,మందల వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చి దిద్దడమే లక్ష్యం...



## రామగుండం కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రామగుండం ప్రాంతాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చేందుకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రధాన లక్ష్యంతో కృషి చేస్తున్నారని రామగుండం కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి అన్నారు.. ఈ మేరకు ఆదివారం స్థానిక పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 300మంది కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాల కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక చౌరస్తాలో రాష్ట్ర ముఖ్యమంత్రి శఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రామగుండం శాసన సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వైద్య శాఖ మాత్యులు దామోదర రాజనరసింహ చిత్రపటాలకు పాలాభిషేకం స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొంతల రాజేష్, నగర మేయర్ బంగి అనీల్ కుమార్, ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, టీపీసీసీ సెక్రటరీ కాల్వ లింగస్వామి హాజరై మాట్లాడుతూ రామగుండం ప్రాంతం అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకుని ప్రజా శ్రేయస్సునే లక్ష్యంగా నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న మా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌పై బురద జల్లే ప్రయత్నం మతి భ్రమించి మాట్లాడుతున్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కేజీ టు పీజీ విద్య అని ప్రజలను మోసం చేయడం జరిగింది. అసత్య ప్రకటనలు చేసి కాలయాపన చేశారు. మా ప్రభుత్వంలో ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసి తద్వారా ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. అంతేకాకుండా రామగుండం ప్రాంతానికి వందల కోట్ల నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారు. దానిలో భాగమే 800మెగావాట్ల పవర్ ప్రాజెక్టుకు రూ.8500కోట్లు కేటాయించారు. దాని ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. 3%ఇ%800 పవర్ ప్రాజెక్టుకు 2400మెగావాట్ల పవర్ ప్రాజెక్టుకు మంజూరు చేయించడం జరిగింది. ఈ ప్రాంతంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి చొరవ తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుకి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కా న్ సింగ్ రాజ్ ఠాకూర్ కి ,కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక చైతన్యానికి విద్య ఒక ఆయుధమని నమ్మాను

## ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందడం ఎంతో ఆనందంగా ఉంది

## డా,, చిట్టి రాజుల యాదగిరి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** సామాజిక చైతన్యంఅనేది విద్య వల్లనే జరుగుతుందని, సమాజాన్ని చైతన్య పరచాలంటే విద్య ఒక ఆయుధంలా పనిచేస్తుందని, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సంపాదించిన చిట్టి రాజుల యాదగిరి అన్నారు.

వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం ఎదుట్ల గ్రామానికి చెందిన చిట్టిరాజుల యాదగిరి ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ను రాజనీతి శాస్త్ర విభాగంలో 'తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి కార్యాచరణ కమిటీల పాత్ర,హైదరాబాద్ జిల్లాలో అధ్యయనం పై ప్రొఫెసర్ నాయుడు అశోక్ పర్యవేక్షణా లో పరిశోధనను పూర్తి చేశాను అని, ప్రస్తుతం డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తూను అని,తనను ప్రోత్సహించి సహకారం అందించిన తల్లిదండ్రులకు అన్నయ్యలకు కృతజ్ఞతలు తెలియ జేశారు.తమ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఉన్నత చదువులు చదివి పరిశోధన పూర్తి చేయడం మాకు ఎంతో గర్వకారణంగా ఉందని మిత్రులు శ్రేయోభిలాషులు, రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారని తనకు తెలిసిన విద్యను పదిమంది పేద విద్యార్థులకు పంచుతానని వీలైనంత ఎక్కువ మందిని చైతన్యపురుస్తానని అని అన్నారు.

# 26న జరిగి మహా ధర్నాకు తరలిరండి



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ :** మహమ్మదాబాద్ మండల కేంద్రంలో ఆదివారం పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేష్ గౌడ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి హాజరైనారు. కురుమూర్తి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను విస్మరిస్తున్నాయని అన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని పిఎఫ్ ఈఎస్ఐ గ్రాటివిటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 26న మహబూబ్ నగర్ జిల్లాలో కార్మికుల మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఈ ధర్నాకు కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రమ్మ, శివ రాములు రఘు, వెంకటమ్మ రాములు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



## బంగారం నగదు అపహరణ

**అగ్నిధారన్యూస్, కమాన్ పూర్:** కమాన్పూర్ మండల కేంద్రంలోని సాగి అంజలి నివాస గృహంలో చోరీకి పాలపడ్డారు. గత వారం రోజుల క్రితం ఆపరేషన్ నిమిత్తం మంచిర్యాలకు వెళ్లగా... ఆదివారం సాయంత్రం తమ నివాస గృహానికి చేరుకోగా ఇంటి తాళాలు పగలగొట్టి.. ఇంట్లో చొరబడి దాదాపు 20తులాల బంగారంతో పాటు రెండు లక్షల నగదు చోరీకి పాల్పడ్డట్లు గుర్తించారు. ఈ విషయం చుట్టుపక్కల వారితో పాటు కమాన్పూర్ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ చోరీపై సమగ్ర విచారణ చేపట్టారు.

# మాలల సింహ గర్జనను విజయవంతం చేయండి..!




**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** మాలల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 1న హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్సలో నిర్వహించనున్న మాలల సింహ గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు కోరారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం "మాలల సింహాగర్జన" బహిరంగ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదలు పెట్టిన ఎస్సీ వర్గీకరణను వెంటనే నిలిపివేయాలని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి అనగా 2014 జూన్ 2 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి పథకాల వారిగా లబ్ధిపొందిన (59) షెడ్యూల్ కులాల వారిగా వివరాలతో శ్వేత పత్రం విడుదల చేయాలని, అలాగే వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను కులాల వారిగా బహిర్గతం చేయాలని, రాష్టంలో పెరిగిన ఎస్సీ జనాభా ప్రకారం 15 నుంచి 22 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సంక్షేమ ఫలాలు, దళిత బందు లబ్ధిదారుల జాబితాను కులాల వారిగా విడుదల చేయాలని, గురుకుల, ఓవర్సీస్ విద్యా రంగాల్లో లబ్ధిపొందిన మాల, మాదిగ ఉప కులాల వారిగా లెక్కలతో ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసే ప్రక్రియను ఇంతవరకు ఎందుకు ప్రారంభించలేదో బీజేపీ పార్టీ కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో పెండింగ్ లో ఉన్న బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేస్తూ ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో ఆర్డినేటర్ కొవ్వూరి వేణు, జంజర్ల జ్ఞాని, నాయకులు దార మధు, దాసరి రామస్వామి, పొనగంటి రాజనర్సు, గుర్రం లక్ష్మిమల్లు, అంబటి కనకయ్య, మట్ట నర్సయ్య, మట్ట రాజయ్య, భూపెల్లి మల్లేష్, గంధం కృష్ణ, ఆటో నర్సయ్య, కూనమల్ల రాజనర్సు, మట్ట శంకర్, అంబటి కొండాల్, మంగ సంతోష్, మెరుగు కుమార్, పలిగిరి చందర్, సుంకిత సదయ్యలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు వెంకటేశ్వర స్వామి చిత్రపటం



**అగ్ని ధార న్యూస్ వనపర్తిజిల్లా :** ఇటీవల తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకునీ వచ్చిన సందర్భంగా వనపర్తి ఎంఎల్ఏ తూడి మేఘారెడ్డి కి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వాల్మీకి సంఘం కన్వీనర్. కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు ఆదివారం ఉదయం తిరుమల హిల్స్ ఎమ్మెల్యే నివాసంలో తిరుమల వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఆ దేవదేవుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నామని అన్నారు. ఎమ్మెల్యేకు వెంకటేశ్వర స్వామి చిత్ర పటాన్ని అందజేసిన అనంతరం మీ హాయంలో వనపర్తి పట్టణం, నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని మొక్కుకున్నట్లు మండ్ల దేవన్ననాయుడు తెలిపారు . ఈ సందర్భంగా ఒకటో వార్డు రాయి గడ్డ లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వార్డులో కల్వర్టుల మీద మ్యానువల్స్, పురాతన కాలం నుండి ఉన్న రెండు ఇనుప కరెంటు స్తంభాలను మార్చాలని, సిసి రోడ్స్ గూర్చి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. సానుకూలంగా స్పందించిన మేఘారెడ్డి త్వరలోనే పనుల్లో మంజూరు చేయించి ప్రారంభిద్దామని అన్నారని దేవన్న నాయుడు తెలిపారు.

# విద్యుత్ షాక్ తో పాడి ఆవు మృతి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన షాంపూరి కృష్ణయ్య కు చెందిన పాడి ఆవు ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద ఎర్త్ వైరు తగిలి మృతి చెందింది. శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి నక్షత్ర హొటల్ సమీపంలో నీ వ్యవసాయ పొలంలో కృష్ణయ్య తనకున్న ఆవులను గడ్డి మేపేందుకు పొలంలో వదిలివేయగా పొలంలోని ట్రాన్స్ఫార్మర్ వద్ద ఉన్న ఎత్తు వైరు తగలడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు కృష్ణయ్య తెలిపారు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందజేసి అవును కాపాడుకునేందుకు ప్రయత్నం చేయగా అప్పటికి మృతి చెందినట్లు గుర్తించినట్లు కృష్ణయ్య తెలిపారు. సుమారు ఆవు విలువ 80 వేలు ఉంటుందని ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతు కృష్ణయ్య కోరారు. సంఘటన స్థలానికి గ్రామ లైన్ మెన్ బంగారితో పాటు పశువైద్య శాఖ అధికారులు సందర్శించి ఆవు కు పోస్టుమార్టం నిర్వహించారు.

# ఇంటి నిర్మాణం పై కప్పుకు చేయూత



## చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** మాడుగుల మండలం ఆర్క పల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎలీషా ఆర్థిక పరిస్థితుల వలన ఇంటీ నిర్మాణాని అగి పోవడం జరిగింది.స్థానిక నాయకులను సంప్రదించగా, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణం పై కప్పు వేయించడం జరిగింది. ఏలిషా కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దార్ల గణేష్, రత్నం, శేఖర్, రమేష్, బంగారి, సైదులు, పాల్గొన్నారు.

# తహసిల్దార్ కార్యాలయం ముందు గద్దర్ విగ్రహానికి భూమి పూజ



## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ప్రక్కన కీర్తి శేషులు ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహానికి ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ, పేదల పెన్నిధి,గద్దర్ జీవితం మొత్తం పేద ప్రజలకు అంకితం చేశారని, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం వారి జీవితం స్ఫూర్తి దాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో, పొల్యూషన్ బోర్డ్ కమిటీ సభ్యులు ఠాగూర్ బాలాజీ సింగ్ ,సాంస్కృతిక సారధి చైర్మన్ కీశే గద్దర్ కూతురు వెన్నెల,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకా%శీ%త్ రెడ్డి,సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్,మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు శేకర్,కవులు, కళాకారులు, పట్టణ మండల ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

## యువజన కాంగ్రెస్ నాయకులు ఆశాదీప్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీ 21 వ వార్డు లో శేఖర్ యాదవ్ అనారోగ్య కారణాలవల్ల మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆశాదీప్ రెడ్డి,వెంటనే స్పందించి చేయడం జరిగింది. కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు సైదుల్ యాదవ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# 30న రైతు సదస్సు ను విజయవంతం చేయండి

## సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** ఈనెల 30న మహబూబ్ నగర్ లోజరగనున్న రైతు సదస్సును రైతులంతా తరలివచ్చి విజయవంతం చేయాలి అని కాంగ్రెస్ రైతు సంఘం అధ్యక్షులు అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆదివారం పెద్దమందడి మండలంలోని అలవాల, పెద్దమందడి, మణిగిల గ్రామాలలోని కొనుగోలు కేంద్రాల దగ్గరకి వెళ్లి రైతులను కోరడం జరిగింది.

వ్యవసాయంలో వచ్చిన ఆధునాతన సాగు పద్ధతులు, మెలకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది.

ఈనెల 28 నుండి రైతుల కోసం వివిధ వ్యవసాయ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని. ఈనెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారని

యూనివర్సిటీ అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ పంప్ కంపెనీలు నూతన ఆవిష్కరణలు, రైతులకు ఉపయోగపడేందుకు అందుబాటులోకి వచ్చిన వివిధ కంపెనీ వినూత్న ఉత్పత్తులను ఇక్కడ స్టాల్ ఏర్పాటు చేసి ఉంచుతారని

ఆధునాతన పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు, వాటిని అన్నిటిని ప్రదర్శనలో ఉంచుతారు. రైతులందరూ 30న జరిగే సభను వచ్చి వెళ్లే విధంగా కాకుండా రైతులకు అవగాహన కల్పించేలా మూడు రోజులపాటు 28వ తేదీ నుండి స్టాళ్లను అందుబాటులో ఉంచి మహబూబ్ నగర్ లో రైతు సదస్సులు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్రంలోని రైతులు దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకునేలా సదస్సు నిర్వహించడం జరుగుతుంది. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని రైతులందరూ పాల్గొని రైతు అవగాహన సదస్సు విజయవంతం చేయాలని ఆయన కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో పెద్దమందడి సింగల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, సింగల్ విండో డైరెక్టర్ నరేష్ కుమార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, గట్టు మన్యం, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పత్తిపాక రిజర్వాయర్ స్థల పరిశీలన

## రాష్ట్ర ఐటీ శాఖమంత్రి శ్రీధర్ బాబు



**అగ్నిదారన్యూస్ (ఎండపల్లి):** ఎద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని పత్తిపాక రిజర్వాయర్ వద్ద నూతనంగా నిర్మించనున్న పత్తిపాక రిజర్వాయర్ కి సంబంధించిన స్థలాన్ని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు , ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్యే విజయ రమణారావు,ఎమ్మెల్యే మక్కన్సింగ్ రాజ్ ఠాకూర్ ఇరిగేషన్ అధికారులు,మండల నాయకులతో కలిసి ఆదివారం రోజున పరిశీలించారు.కార్యక్రమానికి ముందు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ బాబుకి విప్ లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

అనంతరం రిజర్వాయర్ కి సంబందించిన స్థలాన్ని మంత్రి పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశాయి..విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.2014 సంవత్సరం కి ముందు మన ప్రాంతానికి నీళ్ళు ఇస్తామని హామీ ఇచ్చి గత పాలకులు అట్టి హామీని మర్చిపోయారని,గత ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన హరీష్ రావు ఇక్కడి దొర ఇంట్లో పడుకొని రెండు గుట్టల నడుమ రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని దానికి లక్ష్మీనరసింహ స్వామి రిజర్వాయర్ అని పేరు పెడతామని ఆరు కోట్లు మంజూరు చేసి రాడల్ సర్వే చేస్తామని హామీ ఇచ్చి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి అట్టి హామీని విస్మరించారని,మేడారం రిజర్వాయర్ ధర్మారం మండలానికి గుండెకాయవ ంటిదని,రి జర్వాయర్ ఏర్పాటు వల్ల ఇటు ధర్మపురి నియోజక ర్గంతో పాటు పెద్దపెల్లి,ర ామగుండం నియోజకవర్గంలోని ప్రాంత రైతులకు సాగునీరు అందుత ందనే ఉద్దేశంలో మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి,సిఎం దృష్టికి ,ఉప ముఖ్యమంత్రి భట్టి దృష్టికి ప్రాజెక్టు నిర్మాణం గురించి తీసుకెళ్లడం జరిగిందని,దానిలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు స్థల పరిశీలనకు రావడం చాలా సంతోషంగా ఉందని ఈ సంధర్భంగా తెలిపారు.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..పత్తిపాక,మల్లాపూర్ మరియు చుట్టూ ఇతర గ్రామాలకు సాగు నీరు అందించాలన్న ఉద్దేశంలో విప్ లక్ష్మణ్ ,పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు రావు ,రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ,సిఎం దృష్టికి,మంత్రివర్యులు ఉత్తం కుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని,రైతాంగానికి సంబంధించి విషయం కాబట్టి వెంటనే స్పందించి రిజర్వాయర్ కి సంబంధించిన ప్రాథమిక పనులను ప్రారంభించాలనే ఉద్దేశంలో ఇరోజు ఈ ప్రాంతానికి రావడం జరిగిందని,ఇట్టి రిజర్వాయర్ పూర్తి ఐతే సుమారు 10వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చనీ,స్థల సేకరణకు సంబంధించి నివేదిక జిల్లా కలెక్టర్ నుండి రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని,తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు సాగు నీరు అందించాలని ఉద్దేశంలో ప్రభుత్వం ఉందనీ.గత 10నెలల నుండి విప్ లక్ష్మణ్ కుమార్ ఇట్టి ప్రాజెక్టు నిర్మాణం గురించి కష్ట పడుతున్నారనీ,రైతాంగానికి మేలు చేసే ఏ విషయంలో నైన ఎక్కడ రాజీ పడే ప్రసక్తి లేదని ఈ సందర్భంగా తెలిపారు.

# కార్మిక వ్యతిరేక విధానం నిరసిస్తూ జిల్లా కేంద్రంలో నిరసన



## సిపిఎం నాయకులు ఆంజనేయులు,రైతు సంఘం నాయకులు కిషోర్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి పట్టణంలోని యుటిఎఫ్ భవనంలో సిఐటియు సమావేశం నిర్వహించడం జరిగింది.కేంద్ర బిజెపి ప్రభుత్వ రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నవంబర్ 26న జిల్లా కేంద్రాలలో మరియు మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమం చేపట్టాలని యు.టీ.ఎఫ్ భవనం లో రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు కిషోర్, ఆంజనేయులు, మాట్లాడుతూ, రైతులందరికీ పూర్తి పంట రుణాలను మాఫీ చేయాలని అదేవిధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేసి కాంట్రాక్టు విధానాన్ని నిషేధించాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు అమలు చేయాలి రోజుకు కనీస వేతనం 600 ఇవ్వాలని అదేవిధంగా పెండింగ్ బిల్లులు చెల్లించాలని పట్టణ ప్రాంతాలకు కూడా గ్రామీణ ఉపాధి పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరియు భూసేకరణ చట్టం 2013 ను అమలు చేయాలని అటవీ హక్కుల చట్టం 2006ను పటిష్టంగా అమలు చేసి హక్కు పత్రాలను రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని అదేవిధంగా అన్ని పంటల ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం కలిపి మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధ కొనుగోలు హామీ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మతాల మధ్య విభజన ఆపి రాజ్యాంగంలో పొందుపరుచుకున్న లౌకిక సాంప్రదాయాలను కాపాడాలని అధిక ధరలను తగ్గించి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలని పంటల బీమా పథకం అమలు చేసి బీమా పథకం రైతులకు కౌలు రైతులకు వర్తింపజేయాలని అన్నారు. ఈ నెల 26వ తేదీన జరిగే నిరసన కార్యక్రమాలలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు. జిల్లా కార్యదర్శి పరశురాములు పాల్గొన్నారు.

# ఘనంగ అర్ ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు



## మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ శ్రీను

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తెలంగాణ మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు శ్రీనివాస్ ఇంట్లో బిఆర్ఎస్ పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలుకల్వకుర్తి పట్టణంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు శ్రీనివాస్ ఇంట్లో బిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు ,బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గోదావరి తీరాన్ని సందర్శించిన ఇంగ్లాండ్ బృందం



**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని పట్టణంలోని గోదావరి నది తీరాన్ని ఇంగ్లాండ్ ప్రతినిధి బృందం సందర్శించారు. ఆదివారం ఇంగ్లాండ్ దేశం నుండి పర్యాటక ప్రాంతాలను సందర్శించే ప్రతినిధి బృందం మంథని గోదావరి తీరాన్ని సందర్శించి గోదావరినది ప్రాముఖ్యతను అదేవిధంగా కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టత రివర్స్ పంపింగ్ విధానము గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ బృందంలో అదిరియన్ హైనెస్ , అంద్రియ హైనెస్, పాల్ ఫాగన్, డెబియా ఫాగన్, జూలీయా హెడెన్ లతో పాటు అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అంకరి కుమార్ , తదితరులు ఉన్నారు.

# చివరి ఆయకట్టు సమస్యలకు శాశ్వత పరిష్కారంగా పత్తిపాక రిజర్వాయర్





- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు.
- సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ తో రైతులకు అధిక లాభం
- ఆర్థిక వనరులు సమకూరుస్తూ ఒక్కో హామీ అమలు చేస్తున్నాం
- ధర్మారం మండలంలోని పత్తిపాక గ్రామంలో పర్యటన
- రిజర్వాయర్ నిర్మించే స్థలాన్ని పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు

**అగ్నిధార న్యూస్ మంథని :** టెయిల్ ఎండ్ ప్రాంతాల ఆయకట్టు సమస్యలకు శాశ్వత పరిష్కారంగా పత్తిపాక రిజర్వాయర్ నిలుస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు.ఆదివారం ధర్మారం మండలంలో పత్తిపాక గ్రామంలో నిర్మించు ప్రతిపాక రిజర్వాయర్ స్థలాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్పు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి పరిశీలించారు.

అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం ద్వారా పెద్దపెల్లి జిల్లా రైతాంగానికి మేలు జరుగుతుందని ఆలోచనతో ఇక్కడి ప్రజాప్రతినిధులు నీటి పారుదల శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి ప్రాథమిక పనులు ప్రారంభించామని అన్నారు.రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన స్థలం, భూ సేకరణ ప్రతిపాదనలు , ఇతర అంశాలతో కూడిన డిపిఆర్ తయారు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చేపట్టే పత్తిపాక రిజర్వాయర్ ద్వారా జిల్లాలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతూ 2 లక్షల 40 వేల ఎకరాల స్థిరీకరణతో పాటు నూతనంగా 10 వేల ఎకరాల ఆయకట్టు వస్తుందని అన్నారు. అతి తక్కువ ఖర్చుతో అధిక లాభం సమకూరే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. టెయిల్ ఎండ్ ప్రాంతాల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా పత్తిపాక రిజర్వాయర్ నిలుస్తుందని మంత్రి అన్నారు. గతంలో కూడా జిల్లాకు ఆయకట్టు అందించే ఎస్ ఆర్ ఎస్ పి, ఎల్లంపల్లి, వరద కాలువ, మిడ్ మానేరు, లోయర్ మానేరు డాం ప్రాజెక్టులను తమ హయాంలోని నిర్మించామని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం కోసం స్థానిక ప్రజా ప్రతినిధులైన ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రభుత్వంపై బాగా ఒత్తిడి తీసుకొని వచ్చారని అన్నారు.పెద్దపల్లి జిల్లా రైతుల చిరకాల ఆకాంక్ష పత్తిపాక రిజర్వాయర్ నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగుల వేస్తుందని, రైతులతో సంప్రదింపులు జరుగుతూ ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేస్తున్నామని అన్నారు.

**సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ తో రైతులకు అధిక లాభం :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో గతంలో ఎన్నడు లేని విధంగా మన రైతు సోదరులు అత్యధికంగా వరి సాగు జరిగే ఉత్పత్తి సాధించారని, వరి పంటకు మద్దతు ధరతో పాటు సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో రైతులకు ప్రతి బస్తాకు నాలుగు నుంచి ఐదు కేజీలు తరుగు పేరుతో మోసం చేశారని, తమ ప్రజా ప్రభుత్వం రాగానే తరుగు లేకుండా పూర్తి స్థాయి పంట కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి సన్న రకం ధాన్యం వడ్లకు బోనస్ రైతులకు అందుతుందని, ఈ కార్యక్రమం వల్ల రైతులు చాలా సంతోషంతో ఉన్నారని మంత్రి తెలిపారు.ఆర్థిక వనరులను సమకూరుస్తూ ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామని అన్నారు. మన జిల్లా నుంచి గోదావరి జిల్లాలో తరలిస్తూ ఇక్కడ ఆయకట్టు పెంచడంలో గత ప్రభుత్వాలు ఘోర వైఫల్యం పొందాయని, మన దగ్గర బ్యారేజీలు నిర్మించినా ఎటువంటి అదనపు ఆయకట్టు రాలేదని అన్నారు.ధర్మపురి నియోజకవర్గంలోనే శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ప్రభుత్వంతో మాట్లాడి యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలను మంజూరు చేయించారని, తన శాసనసభ పరిధిలోని ఆరోగ్యం, పాఠశాలలు రోడ్ల నిర్మాణ పనులకు ప్రత్యేక కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు, రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, నీటిపారుదల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దీక్షా దివస్.. 29న నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం




**హైదరాబాద్ :** ఈ నెల 29న దీక్షా దివస్ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నవంబర్ 29, 2009 న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజని మన అందరికీ తెలుసు అని కేటీఆర్ తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో నిమ్స్ హాస్పిటల్ పాత్ర కూడా ఎంతో ఘనమైనది. నాడు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్‌కు తరలించడంతో.. నిమ్స్ కదన రంగంగా మారిపోయిన పరిస్థితి. మలిదశ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిన పరిస్థితి. కాబట్టి నవంబర్ 29న నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామని కేటీఆర్ తెలిపారు. దీక్షా దివస్‌తో పాటు తెలంగాణ తల్లి విగ్రహ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గులాబీ కుటుంబ సభ్యులకు పిలుపునిస్తున్నాను. ఆనాటి కార్యక్రమాలు, ఉద్యమ జ్ఞాపకాలను మళ్లీ గుర్తు తెచ్చే విధంగా మీడియా కూడా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. కేసీఆర్ తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో మళ్లీ రగిలించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఈ దుర్మార్గ కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలనే సంకల్పంతోనే ఈ దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను కాపాడుకుందాం.. కేటీఆర్ పిలుపు**

కాంగ్రెస్ కబంధహస్తాల నుండి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కాపాడుకోవాలని మరో సంకల్ప దీక్ష చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అని ప్రొఫెసర్ జయశంకర్ చెప్పిన మాటలను కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ పాలనలో ప్రతి వర్గం, ప్రతి మనిషి బతుకు ఛిద్రమైన పరిస్థితి. మళ్లీ ఇవాళ ఆ పరిస్థితితులు తిరిగి కనబడుతున్నాయి. అదే నిర్బంధం, అదే అణిచివేత, అవే దుర్భర పరిస్థితులు, ఆందోళనకరమైన పరిస్థితి కనబడుతుంది. నాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో నేడు మళ్లీ రెండు ఢిల్లీ పార్టీ మెడలు వంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తిరిగి తెలంగాణలో బతుకు అంధకారమైందని రైతులు, ఆటో కార్మికులు, నిర్మాణ రంగంలో ఉండే కూలీలు అట్టడుగు స్థాయి నుంచి సంపన్న వర్గాల వరకు అందరూ బాధపడుతున్నారు అని కేటీఆర్ తెలిపారు. ఈ దీక్షా దివస్ నుంచి స్ఫూర్తి పొంది.. తన సంకల్ప బలంతో అందర్నీ మెప్పించి ఒప్పించి ముందుకు పోయాడు కేసీఆర్. అదే విధంగా కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కాపాడుకునేందుకు మరో సంకల్ప దీక్ష కూడా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైంది. ఆనాడైనా, ఏనాడైనా, ఈనాడైనా తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అని జయశంకర్ సార్ చెప్పేవారు. కేసీఆర నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు. దాని కోసం పార్టీ శ్రేణులు కలిసికట్టుగా ముందుకు పోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## సిట్ వర్క్ షురూ..

**తిరుమల :** దేశవ్యాప్త సంచలనంగా మారిన తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కేసు విచారణ వైపు అడుగులు వేస్తోంది. ఔఆఆః కాఫ్ నివేదిక ఆధారంగా నెయ్యిలో కల్తీ నిజమేనన్న టీటీడీ వాదన, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్న కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఎట్టకేలకు సుప్రీం కోర్టు దాకా వెళ్ళిన వ్యవహారంలో కేంద్ర బృందం కల్తీ నెయ్యి కేసును విచారించబోతోంది.శ్రీహరి భక్తులకు అత్యంత ప్రీతి పాత్రమైన లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న అభియోగాలు, ఆరోపణల్లో నిజాలు నిగ్గు తేల్చేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో ఉండే అధికారులపై ఇప్పటికే స్పష్టత కూడా వచ్చింది. ఐదు మంది సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏపీ ప్రభుత్వం నుంచి గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జెట్టీల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇక సీబీఐ తరఫున పాల్గొనే విచారణ అధికారుల పేర్లను ఆ దర్యాప్తు సంస్థ కూడా ఇప్పటికే ప్రకటించింది. సీబీఐ హైదరాబాద్ జోన్ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు, విశాఖ ఎస్పీ మురళి రాంబాతో పాటు ఎఫ్ఎస్ఎస్ఏఐ (నాణ్యత హామీ) సలహాదారు డాక్టర్ సత్యేన్ కుమార్ పాండాలను నియమించింది.సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఈ సిట్ పని చేయనుండగా, ఇప్పటికే ఏపీ సర్కార్ సిట్ ను ఏర్పాటు చేసి కొంతమేర విచారించింది. కేంద్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేయడానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని అధికారుల బృందంతో కొంత దర్యాప్తు కూడా పూర్తి చేయించింది. విచారణ అధికారుల బృందం 3 రోజుల పాటు తిరుపతి, తిరుమలలో కూడా పర్యటించింది. కల్తీ నెయ్యి సరఫరాపై కేసు పెట్టిన ప్రొక్యూర్మెంట్ జీఎం మురళీకృష్ణ నుంచి వాంగ్మూలం తీసుకోవడంతో పాటు పిండిమర, ల్యాబ్ లను పరిశీలించి ప్రాథమిక నివేదిక రూపొందించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిట్ ను రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టింది. ప్రాథమిక సమాచార సేకరణలో భాగంగా సీబీఐ సిట్ బృందం టిటిడిలో సరకుల కొనుగోలు విధానం, టెండర్ల ప్రక్రియ, ల్యాబ్ లలో పరీక్షల తీరుపై వివరాలు సేకరించింది. నెయ్యి సరఫరా కాంట్రాక్టును దక్కించుకున్న సంస్థ మరో సంస్థ నుంచి సరకు సేకరించడం, ఆ సంస్థ మరో కంపెనీ నుంచి కొనుగోలు చేసిందన్న కొంత సమాచారాన్ని రాబట్టింది. ఈ నేపథ్యంలో దర్యాప్తు బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర పరిశీలన చేసి, నివేదిక ఇవ్వబోతుండగా, సిట్ ఎంక్వయిరీ కి అవసరమైన ప్రత్యేక కార్యాలయం, కావాల్సిన వసతులపై సీబీఐ టీటీడీకి లేఖ కూడా రాసింది. క్షేత్రస్థాయిలో దర్యాప్తునకు సిద్ధమైన సిట్ టీం సహాయ సహకారాలు అందించేందుకుగాను 30 మంది అధికారులను తీసుకోనుంది. డీఎస్పీ స్థాయి నుంచి మినిస్టీరియల్ సిబ్బంది వరకు అవసరం ఉంటుందని భావించింది.ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించిన దర్యాప్తు బృందం అధికారులను కూడా ఎంపిక చేసుకోనుంది.

# నేడు మంథని లో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



**అగ్నిధార న్యూస్ మంథని :** పెద్దపల్లి జిల్లా మంథని మండలంలో సోమవారం రోజున ఐటి , పరిశ్రమల ,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతుండగా ఉదయం 11-00 గంటలకు సి ఆర్ ఆర్ 7 కోట్ల నిధులతో నిర్మించబోతున్న పిడబ్ల్యుడి రోడ్ ఖానాపూర్ నుండి ఎల్ మడుగు డబల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు.మధ్యాహ్నం 1-00 గంటలకు 20 లక్షల తో నిర్మించబోతున్న నాగారం హెల్త్ సబ్ సెంటర్ శంకుస్థాపన చేయనున్నారు.మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో పాల్గొని అనంతరం అన్ని అంగన్వాడి సంబంధించిన పిల్లలకు నూతన దుస్తులు , ఫర్నిచర్ పంపిణీ చేయనున్నారు.

## నిర్భయంగా అబద్ధాలు మాట్లాడే సీఎం రేవంత్‌కు డబుల్ పీహెచ్‌డీ ఇవ్వాలి.. హరీశ్‌రావు సెటైర్లు

అబద్ధాలు ప్రచారం చేయడంలో సీఎం రేవంత్ రెడ్డికి డబుల్ పీహెచ్‌డీ ఇవ్వొచ్చని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పట్టపగలే నిర్భయంగా గోబెల్స్ ప్రచారం చేస్తుంటాడని విమర్శించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటక, తెలంగాణలో గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ నాయకులు మోసం చేశారని అన్నారు. మహారాష్ట్రలోనూ గ్యారెంటీ పేరుతో మోసం చేయబోయారని తెలిపారు. అక్కడకు వెళ్లి మహిళలకు 3 వేలు, రైతులకు రుణమాఫీ చేస్తామని హామీలు గుప్పించారని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి సీఎం, మంత్రులు వెళ్లి ప్రచారం చేశారని చెప్పారు. కానీ వీరిని చూడగానే తెలంగాణలో చేసిన మోసాన్ని గుర్తించారని.. అందుకే తగిన బుద్ధి చెప్పారని అన్నారు. నూటొక్క దేవుళ్ల మీద ఒట్లు పెట్టి సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు 2500, ఫించన్, భరోసా బోనస్, తులం బంగారం ఇవ్వలేదని అన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పారు. రేవంత్, కాంగ్రెస్ నాయకులు బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. ఓటమి తర్వాత అయినా బుద్ధి తెచ్చుకొని, వంద రోజుల్లో చేస్తామన్న హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని విమర్శించారు.దళిత బంధు పథకాన్ని హుజూరాబాద్‌లో కేసీఆర్ ప్రారంభించారని కేసీఆర్ గుర్తుచేశారు. 18,500 కుటుంబాలకు కేసీఆర్ దళిత బంధు ఇచ్చారని తెలిపారు. రెండో విడత డబ్బులు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మీద అరాచకానికి పాల్పడ్డారని తెలిపారు. కొత్త పథకాలు దేవుడెరుగు. మేము ఇచ్చినవి ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఆర్థిక మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా ఉండి దళితులకు ఏదైనా మేలు చేశారా అని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు.ఇప్పటికే విడుదలైన దళిత బంధు పథకం డబ్బులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొడంగల్‌లో ఏర్పాటు చేసేది ఫార్మా సిటీ కాదు.. ఇండస్ట్రియల్ కారిడార్ అని సీఎం రేవంత్ రెడ్డి మాట మార్చడంపై హరీశ్‌రావు మండిపడ్డారు. అబద్ధాలు చెప్పడానికి సిగ్గుండాలని అన్నారు. జూలై 19వ తేదీన ఇచ్చిన గెజిట్‌లో ఫార్మా సిటీ అని పేర్కొన్నారని తెలిపారు. ఆ గెజిట్‌ను వాపసు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందు ప్రజల దగ్గరకు వెళ్లి మాట్లాడాలని.. సమస్య పరిష్కరించాలని సూచించారు. పచ్చటి పొలాలను తొండలు పెట్టని జాగ అంటున్నారని మండిపడ్డారు. అబద్ధాలు మాట్లాడటంలో రేవంత్ రెడ్డికి డాక్టరేట్ ఇవ్వాలని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రచారం చేసిన దగ్గర కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో మోసం చేసింది చాలదని.. మా వద్దకు వచ్చారని మహారాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. మాటలు, మూటలు కట్టుడు బంద్ చేసి, గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు లెక్క పాత బకాయిలు కలుపుకొని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులు, కేసులను హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. వెంటనే దళిత బంధు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిగురించి దళితుల పక్షాన అసెంబ్లీలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## ప్రభుత్వాలు శాశ్వతం కాదు.. పోలీసులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హితవు

సీఎం రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉన్న సాయిరెడ్డి భౌతిక కాయానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నివాళులర్పించారు. సాయిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. తన చావుకు సీఎం రేవంత్ రెడ్డి బ్రదర్స్ కారణమని సాయిరెడ్డి తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారని తెలిపారు. అయినప్పటికీ పోలీసులు 108 బీఎన్ఎస్ కింద కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం బ్రదర్స్ రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని.. రాజ్యాంగానికి లోబడి విధులు నిర్వహించాలని పోలీసులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హితవు పలికారు. సాయిరెడ్డి మృతికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్యాయానికి గురైన వారి తరఫున బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## బఫర్‌జోన్‌లో రంగనాథ్ ఇల్లు!

**పెద్దచెరువును మింగిన కృష్ణకాంత్ పార్క్**

**హెచ్ఎండీఏ మ్యాప్‌లో చెరువు కనుమరుగు**

**చెరువు ఆధారాలు బయట పెట్టిన బక్క జడ్సన్**

**హైదరాబాద్ :** హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్క్ దగ్గరలోనే రంగనాథ్ ఇల్లు ఉందని, అది చెరువు బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందని కాంగ్రెస్ బహిష్కృతనేత బక్క జడ్సన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఆధారాలు బయటపెట్టారు.

**పార్కు కాదు పెద్ద చెరువు**

ప్రస్తుతం కృష్ణకాంత్ పార్కు ఉన్న ప్రాంతం ఒకప్పుడు పెద్ద చెరువు. చంద్రబాబు హయాంలో చెరువును పూడ్చి పార్కును నిర్మించారు. ఎక్కడైనా చెరువు గట్టున మైసమ్మ గుడి ఉంటుంది. కృష్ణకాంత్ పార్కుకు సమీపంలోని కట్టమైసమ్మ ఆలయమే నిదర్శనం. పెద్ద చెరువు ఆధారాలు హెచ్ఎండీఏ మ్యా ప్‌లో మనకు కనిపించవు. కానీ వందే ఠ్ల క్రితం నాటి మ్యాప్‌లో పెద్ద చెరువు ఆనవాళ్లను బక్క జడ్సన్ బయటపెట్టారు. చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన ఇంట్లో నివసించడంలేదని రంగనాథ్ నిరూపించుకోగలరా? అని జడ్సన్ ప్రశ్నించారు. వెంగళరావునగర్‌లో రంగనాథ్ నివసిస్తున్న ఇల్లు పెద్ద చెరువు బఫర్ జోన్‌లో ఉంది. హైడ్రా పేరుతో రంగనాథ్ అన్యాయంగా పేదల ఇండ్లు కూల్చారు. బాధను చెప్పుకోవడానికి, సామాన్లు తరలించుకోవడానికి కూడా సమయం ఇవ్వలేదు. రెండు నెలలు కష్టపడి వందేళ్ల నాటి మ్యాప్ సేకరించాను. ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టాన్ని ఎందుకు అమలు చేయడం లేదు? ప్రజలకు ఓ న్యాయం, సీఎం అన్న తిరుపతిరెడ్డికి మరో న్యాయం ఉంటుందా? హైడ్రా కూల్చివేత బాధితులకు పరిహారం చెల్లించాలి.




# రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' నుంచి థర్డ్ సింగిల్ అప్‌డేట్

ఆర్‌ఆర్‌ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ మూవీ కోసం మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఆచార్య సినిమా వచ్చిన ఈ సినిమా డిజాస్టార్ అవ్వడంతో వారి ఆశలన్నీ ప్రస్తుతం వస్తున్న గేమ్‌ఛేంజర్ పైనే ఉన్నాయి. తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథను అందిస్తున్నాడు. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాను సంక్రాంతి? కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. అయితే మూవీ నుంచి ఇప్పటికే టీజర్‌తో పాటు రెండు పాటలను విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా థర్డ్ సింగిల్ అప్‌డేట్‌ను వెల్లడించారు మేకర్స్. ఈ మూవీలోని థర్డ్ సింగిల్‌ను నవంబర్ 28న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇక ఈ మూవీలో కన్నడ నటుడు జయరాయ్, సునీల్, నవీన్ చంద్ర, శ్రీకాంత్, బాలీవుడ్ నటుడు హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి పాపులర్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# కచ్చితంగా హిట్ అనుకున్న ప్రతిసారి ఎదురుదెబ్బ తగిలేది

భావోద్వేగాలను సునాయాసంగా పండించగల టాలీవుడ్ నటులలో సత్యదేవ్ ఒకరు. తాజాగా ఆయన నటించిన 'జీబ్రా' సినిమా విడుదలై మంచి పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకుంది. ఈ మూవీ సక్సెస్‌తో ఆనందంలో ఉన్న సత్యదేవ్.. తన నటనా ప్రస్థానం గురించి, ఇంతకు ముందు సక్సెస్ వచ్చినట్లుగా వచ్చి తృటిలో తప్పిపోతుంటే ఎలా ఉండేదో షేర్ చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే చాలా బావుందనిపిస్తోంది. కానీ ఎందుకో నాకు రావాల్సినన్ని విజయాలు రాలేదనిపిస్తుంది. 'బ్లఫ్ మాస్టర్' బావుందని ఇప్పుడు అనేక మంది చెబుతూ ఉంటారు. కానీ అది పెద్ద విజయం సాధించలేదు. 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' సినిమాను ఇప్పటికీ మెచ్చుకుంటారు. కానీ కొవిడ్‌వల్ల ఆ సినిమా పెద్దగా ఆడలేదు. 'తిమ్మరసు' కూడా చాలా మంచి సినిమా. అది విడుదలయ్యే సమయంలో కొవిడ్ సెకండ్ వేవ్ వచ్చింది. సినిమా హాళ్లలో 50 శాతం మందినే అనుమతించేవారు. దాంతో అనుకున్నంత విజయం సాధించలేదు. తర్వాత 'కృష్ణమ్మ' రెండేళ్లు ఆగిపోయింది. ఆ సినిమా విడుదలయిన వెంటనే.. అంటే ఆరు రోజులకే ప్రైమ్ ఓటీటీలో వదిలేశారు. దీంతో కలెక్షన్లు సరిగ్గా రాలేదు. ఇప్పుడు 'జీబ్రా'తో విజయం సాధించాను. ఇక్కడ ఒక మాట చెప్పాలి. నా సినిమాలు విజయాలు సాధించటానికి ఎంత చేయగలనో అంత చేస్తున్నాను. విజయాలు వచ్చే వరకు పట్టుదల వీడను. ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాను. ఇక విజయాలు తృటిలో తప్పిపోతుంటే మొదట్లో చాలా బాధగా అనిపించేది. 'కచ్చితంగా అవుతుంది' అనుకున్నప్పుడల్లా ఎదురుదెబ్బ తగిలేది. దాని నుంచి బయట పడి మళ్లీ ట్రాక్ ఎక్కామనుకున్నప్పుడు మరో దెబ్బ.. ఇప్పటి వరకు ఇలా గడిచింది. దీనితో బహుశా నా ప్రయాణం ఇంకా మొదలవలేదు అనే సిద్ధాంతాన్ని నమ్మటం మొదలు పెట్టాను. కొందరికి అతి త్వరగా విజయం లభిస్తుంది. 25 ఏళ్లకే సీఈఓలు అయిపోతారు. 50 ఏళ్లు వచ్చేసరికి పతనం అంచుకు చేరుకుంటారు. కొందరు 50 ఏళ్లకు విజయం సాధించవచ్చు. కానీ ఆ విజయం వారి జీవితం చివరి దాకా ఉంటుంది. నాకు కూడా అంతేనేమో అనుకుంటాను. చాలా మంది ఒక శుక్రవారంతో నటుల జీవితం మారిపోతుందని అనుకుంటూ ఉంటారు. బహుశా ఆ శుక్రవారం నా జీవితంలో ఇంకా రాలేదు. ఇప్పటి వరకు నేను పెద్ద ప్రొడక్షన్ హౌస్‌లలో సినిమాలు చేయలేక పోయాను. నాకు అలాంటి ఛాన్స్ దొరకలేదు. 'జీబ్రా' తర్వాత నాకు అలాంటి అవకాశాలు వస్తాయనుకుంటున్నానని చెప్పుకొచ్చారు.




## విలన్‌గా విజయ్ ఆంటోనీ మేనల్లుడి గ్రాండ్ ఎంట్రీ

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో నటుడిగా, సంగీత దర్శకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా మల్టీటాలెంటెడ్ స్కిల్స్‌తో వినోదాన్ని అందిస్తున్న అతికొద్ది సెలబ్రిటీల్లో టాప్‌లో ఉంటాడు విజయ్ ఆంటోని బిచ్చగాడు సినిమాతో ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన విజయ్ ఆంటోనీ గగన మార్గన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడని తెలిసిందే. లియో జాన్ పాల్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం యూనిక్ మర్డర్ మిస్టరీ నేపథ్యంలో సాగే డిటెక్టివ్ ఫిక్షన్‌గా వస్తోంది. ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్‌లో ముఖంపై గాట్లతో కొంచెం ఆందోళనగా ఉన్నట్టుగా కనిపిస్తున్న స్టిల్ ప్రేక్షకుల్లో సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా సినిమా విలన్‌ను పరిచయం చేస్తూ రిలీజ్ చేసిన లుక్స్ తో ఇంట్రెస్టింగ్ వార్తలను అందరితో షేర్ చేసుకున్నారు మేకర్స్. ఈ మూవీతో విజయ్ ఆంటోనీ మేనల్లుడు అజయ్ ధీషన్ విలన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నాడు. విజయ్ ఆంటోనీ, అజయ్ ధీషన్ మధ్య భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉండబోతున్నాయని తాజా పోస్టర్లు చెప్పకనే చెబుతున్నాయి. మరి సిల్వర్ స్క్రీన్‌పై మామా అల్లుళ్ల ఫైట్ ఎలా ఉండబోతున్నది ఆసక్తికరంగా మారింది. డెబ్యూ సినిమాతో అందరి ఫోకస్ తనవైపు తిప్పుకుంటున్నాడు అజయ్ ధీషన్. ఈ చిత్రాన్ని విజయ్ ఆంటోనీ ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై మీరా ఆంటోనీ నిర్మిస్తున్నారు.

# శివరాజ్ కుమార్ 'భైరతి రణగల్' ట్రైలర్ రిలీజ్



కన్నడ చక్రవర్తి స్టార్ హీరో శివరాజ్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం భైరతి రణగల్. ఈ సినిమాకు నర్తన్ దర్శకత్వం వహిస్తుండగా.. సప్త సాగరాలు దాటి హీరోయిన్ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా కన్నడలో నవంబర్ 15న ప్రేక్షకుల ముందుకు మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమాకు వచ్చిన టాక్‌తో తాజాగా తెలుగులో డబ్ చేస్తున్నారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ నుంచి తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే శివరాజ్ కుమార్ మరోసారి తన మాస్ యాక్షన్‌తో అలరించబోతున్నట్లు తెలుస్తుంది. 2017లో సూపర్ హిట్ చిత్రంగా నిలిచిన మఫ్తీకి ప్రీక్వెల్‌గా ఈ చిత్రం వస్తుండగా.. గీతా పిక్చర్స్ బ్యానర్ పై గీతా శివరాజ్ కుమార్ ఈ సినిమాను నిర్మించింది. తెలుగుతో పాటు తమిళంలో ఈ చిత్రాన్ని నవంబర్ 29న విడుదల చేయనున్నారు మేకర్స్.

# నాగచైతన్యతో మీనాక్షి చౌదరి





టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం తండేల్ సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. చందూ మొండేటి డైరెక్ట్ చేస్తున్న ఈ రొమాంటిక్ డ్రామా ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా విడుదల కాకముందే ఎన్‌సీ24ను ప్రకటించేసి అక్కినేని అభిమానుల్లో జోష్ నింపుతున్నాడు. విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ వర్మ దండు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. మైథలాజికల్ టచ్‌తో ఈ సినిమా ఉండబోతుందట. ఈ సినిమా షూటింగ్ డిసెంబర్ రెండో వారం నుంచి షురూ కానుందని తెలుస్తుండగా.. తాజాగా ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో ఎవరు కనిపించబోతున్నారనే దానిపై ఆసక్తికర వార్త ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ది గోట్, లక్కీ భాస్కర్ సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న మీనాక్షి చౌదరిని హీరోయిన్‌గా తీసుకోబోతున్నారట. ప్రస్తుతానికి ఇది అధికారిక వార్త కాకున్నా.. అప్పుడే ఈ న్యూస్‌ను మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు చైతూ ఫాలోవర్లు. మరి మేకర్స్ దీనిపై రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. ఎన్‌సీ24 వర్కింగ్ టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లపై బోగవల్లి ప్రసాద్–సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com